ప్రజాశక్తి

బుధవారం 5 నవంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పంచాయతీల్లో సమూల మార్పులు

- రూర్బన్‌గా 11 గ్రామాలు ఎంపిక
- కార్యదర్శుల పోస్టులను పిడిఒగా మార్పు
- మొత్తం నాలుగు గ్రేడ్‌లుగా పంచాయతీల గుర్తింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గ్రామ పంచాయతీల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా జిల్లాలో స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా 11 గ్రామాలను ఎంపిక చేస్తూ జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జిల్లాలోనే అధిక జనాభా, ఎక్కువ ఆదాయం కలిగిన గ్రామాలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా ఎంపిక చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. వీటిల్లో పేరేచర్ల, నంబూరు, పెదకాకాని, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, తాడికొండ, చేబ్రోలు, వడ్లమూడి, దుగ్గిరాల, కొల్లిపర, కొలకలూరు గ్రామాలున్నాయి. ఈ గ్రామాలను ఇక మీదట రూర్బన్‌గా పిలుస్తారు. వీటిలో గ్రామ కార్యదర్శులుగా డిప్యూటీ ఎంపిడిఒ హోదా కలిగిన అధికారులు ఉంటారు. ప్రస్తుతం గ్రేడ్-1గా ఉన్న పంచాయతీలను గ్రామీణ ప్రాంతంలోనే అర్బన్ ప్రాంతంగా ఎంపిక చేసి స్పెషల్ గ్రేడ్ రూర్బన్‌గా ఎంపికకు గతనెల 10వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. మారిన వ్యవస్థలో గ్రామీణ స్థాయిలో అర్బన్ స్థాయి కలిగిన పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా ఎంపిక చేశారు. రూర్బన్‌తో పాటు అన్ని పంచాయతీల కార్యదర్శులను పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పిడిఒ)గా మార్పు చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.



రూర్బన్‌గా ఎంపికైన కొలకలూరు పంచాయతీ కార్యాలయ భవనం

రూర్బన్ పంచాయతీలంటే 10వేల జనాభాపైన ఉండి మండల పరిధిలో అత్యధిక ఆదాయం కలిగి ఉండాలి. ఈ విధంగా జిల్లాలో 11 పంచాయతీలను గుర్తించారు. ఈ పంచాయతీల కార్యదర్శులు గెజిటెడ్ హోదా కలిగి ఉంటారు. గ్రేడ్-1 పంచాయతీలుగా జిల్లా మొత్తం మీద 55 గ్రామాలను ఎంపిక చేశారు. మరో 75 గ్రామాలను గ్రేడ్-2గా, ఇంకా 116 గ్రామాలను గ్రేడ్-3 పంచాయతీలుగా ఎంపిక చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో నాలుగు స్థాయిలో కార్యదర్శులుగా పనిచేస్తున్నారు. వీరితో పాటు ఆరేళ్ల క్రితం సచివాలయాల్లో ఎంపికైన పంచాయతీ కార్యదర్శులను ఐదు, ఆరు కేటగిరిలో ఉంచారు. ఆరో కేటగిరి కార్యదర్శి చాలా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌గా కంప్యూటర్‌కు సంబంధించిన అంశాల్లో వినియోగిస్తున్నారు.

మొత్తం ఆరెంచల వ్యవస్థను నాలుగు అంచెలుగా మార్చేందుకు రూపొందించిన సంస్కరణల్లో భాగంగా ఈ మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు ఉన్న క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి గ్రామపంచాయతీలను స్వతంత్ర యూనిట్‌లుగా ప్రకటిస్తూ ఈ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో కొత్త సిబ్బందిని కూడా నియమించాలని నిర్ణయించారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, కంట్రీ టౌన్ ప్లానింగ్, వీధి లైట్లు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది, రెవెన్యూ విభాగాలను రూపకల్పన చేశారు. వీరి జీతాలు గ్రామపంచాయతీ సాధారణ

2లో



వివాదం సందర్భంలో వింజనంపాడు సచివాలయంలో రైతులు

యూరియా కొరత తెచ్చిన ఘర్షణ

వింజనంపాడులో రైతుల మధ్య గొడవ - నిలిచిన సరఫరా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రైతులందరి అవసరాలకు సరిపడా యూరియా లేకపోవడంతో ఉన్న ఎరువునే తాము దక్కించుకోవాలనే రైతుల తపన ఘర్షణకు దారి తీయడంతోపాటు పంపిణీ నిలిచింది. నియోజకవర్గంలోని వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు సచివాలయంలో మంగళవారం జరిగిన ఘటనపై వివరాల ప్రకారం.. వట్టిచెరుకూరు మండలానికి 260 టన్నులు యూరియా మంజూరవగా ఇది అన్ని గ్రామాల్లోని రైతుసేవ కేంద్రాలకు 20 టన్నులు (400 బస్తాలు) చొప్పున సోమవారం వచ్చింది. ఈ క్రమంలో వింజనంపాడులో రైతులు ఎరువుల కోసం మంగళవారం రాగా పాస్ బుక్‌ల ఆధారంగా పంపిణీ చేసేందుకు రైతుల పేర్లను గ్రామ వ్యవసాయ సహాయ సంచాలకులు స్థానిక సచివాలయం వద్ద నమోదుకు సిద్ధమయ్యారు. ఎరువుల కోసం వంద మందికిపైగా రైతులు రావడం, ఉన్న యూరియా అంతా అందరికీ సరిపోదనే చర్చ మొదలవడంతో చిన్నచిన్నగా రైతుల్లో ఆందోళన మొదలైంది. దీంతో గతంలో తీసుకోని రైతులకు తొలి ప్రాధ్యామివ్వాలని, ఆ తర్వాత ఇతర రైతులకు ఇవ్వాలని కొందరు కోరారు. ఇందుకు ఇతర రైతులు అభ్యంతరం చెప్పారు. తమకూ ఎరువు కావాల్సిందేనని, లేకుంటే తమ పంటలేంగావాలని పట్టుబట్టారు. దీనిపై రైతుల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి ఆపై పరస్పరం నెట్టుకోవడంతోపాటు ఘర్షణపడ్డారు. తోపులాట

2లో

7న సోవియట్ విప్లవ వార్షికోత్సవ సదస్సు

హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

ప్రజాశక్తి-గుంటూరు

సోవియట్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 7న సాయంత్రం 4 గంటలకు 'పెట్టుబడిదారీ విధానం-భవిష్యత్' అనే అశంపై సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లాకార్యదర్శి వై.నేతాజీ కోరారు. బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సదస్సులో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్. బాబూరావు తదితరులు ప్రసంగిస్తారన్నారు. 1917లో సోవియట్ విప్లవం జయప్రదమై సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం జరిగిందని, అందరికీ విద్య, వైద్యం, ఉపాధి కల్పించడమే కాక, కార్మికవర్గానికి 8 గంటల పనిదినం అమలు చేసిందని, మహిళల హక్కులను కాపాడిందని చెప్పారు. అనంతరం రష్యా స్ఫూర్తితో ప్రపంచంలో చైనా, క్యూబా, వియత్నాం తదితర దేశాల్లో కార్మికవర్గ రాజ్యాలు ఏర్పడ్డాయన్నారు. నేడు చైనా ప్రపంచంలో అప్రతిహతంగా పురోగమిస్తోందని, మరోవైపు పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో కూరుకుపోతోందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడిదారీ దేశాలకు నాయకత్వం వహిస్తున్న అమెరికాలో నేడు నిరుద్యోగం పెరగడమేకాక, ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోతోందన్నారు. ఈ సంక్షోభం నుండి బయటపడేందుకు ప్రపంచంలోని అన్ని దేశాలపై అక్రమంగా సుంకాలు విధిస్తోందని చెప్పారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్ పాల్గొన్నారు. సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రమైన ఫిరంగిపురం, దుగ్గిరాల మండలం చిలువూరులో కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎం.హోచిమిన్, అంకమ్మరావు, జి.వెంకటేశ్వరరావు, వెంగళరెడ్డి, జె.బాలరాజు, ఎన్.వెంకటేశ్వరరావు, కె.బాలస్వామి, ఎన్.ఉదయరాజు, బి.కనకాంబరం, కె.అర్జున్, మల్లేశ్వరరావు, భూషణం, నరసింహారావు, సాంబశివరావు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న వై.నేతాజి



పల్నాడు చిన్నారి.. అమెరికాకు దత్తత

ఏడాది పాపను దత్తత తీసుకున్న ఇల్లినాయిస్ నగర దంపతులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అమెరికాలోని ఇల్లినాయిస్ నగరానికి చెందిన ఒక కుటుంబం పల్నాడు జిల్లాకు చెందిన పాపను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారితో జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల మాట్లాడిన తర్వాత తొలి దత్తత స్వీకారానికి ప్రభుత్వం అంగీకరించింది. కొన్ని నెలల క్రితం నాగార్జున సాగర్ వద్ద వదిలి వెళ్లిన నెలల చిన్నారి మహిళా అభివృద్ధి-శిశు సంక్షేమ శాఖ అనుబంధ విభాగమైన ప్రత్యేక దత్తత విభాగం సంరక్షణలో ఉన్న ఏడాది వస్సున్న అమర ప్రగతిని అమెరికాలోని ఇల్లినాయిస్ నగరానికి చెందిన బ్రాడెన్ రీజ్‌వెబ్ అనే వ్యక్తి దత్తత తీసుకునేందుకు

2లో

పోలీసుల సంక్షేమానికి కృషి

తుళ్లూరులో డిఎస్‌పి కార్యాలయ ప్రారంభోత్సవంలో హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - తుళ్లూరు



పోలీసులకు కావాల్సిన అన్ని సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తుళ్లూరు పోలీస్ సబ్ డివిజన్ నూతన కార్యాలయాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పోలీసులకు రూ.కోటి వరకు బీమా కల్పిచామని, కూటమి ప్రభుత్వం వచ్చాకే 6100 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. పోలీసు చనిపోతే వారి కుటుంబానికి అండగా ఉంటామని, బీమా ద్వారా కనిష్టంగా రూ.15 లక్షలు ఇస్తామని చెప్పారు. ఈ సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత ఉందని, త్వరలో అన్నీ భర్తీ చేస్తామని చెప్పారు. రాజధాని కోసం రైతులు ఉచితంగా భూములు త్యాగం చెయ్యడం గొప్ప విషయమని, అమరావతి రైతుల కష్టం ప్రతిఫలమే ఇవాళ అందరూ చూస్తునారని అన్నారు. ఈ బిల్డింగ్ పూర్తి చేయడానికి ఎస్పీ వకుల్ జిందల్, డీఎస్పీ మురళీకృష్ణ చాలా కృషి చేశారని అభినందించారు. పోలీస్ వ్యవస్థను బాగా బలోపేతం చేసేందుకు డీజీపీ కృషి చేస్తున్నారని అన్నారు. కల్పిత వీడియోల ద్వారా చాలా మంది ఇబ్బంది పెడుతున్నారని, అలాంటి వాటిని ఏపీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ మధ్య కాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ లారీపై రాళ్లు వేసిన వీడియోను.. ఆంధ్రప్రదేశ్‌లో జరిగినట్లు వైసిపి ప్రచారం చేసిందని మండిపడ్డారు. తప్పుడు వార్తలు వ్యాపించకుండా టెక్నాలజీ ఉపయోగించాలని సిఎం చంద్రబాబు ఆదేశించారని చెప్పారు. కార్యక్రమంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల జిందాల్, డీఎస్పి మురళీకృష్ణ పాల్గొన్నారు.



ఉపాధ్యాయ సాంస్కృతికోత్సవాలకు హాజరవ్వాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బాలోత్సవాల స్ఫూర్తితో పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో ఈ ఏడాది రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ సాంస్కృతిక పోటీలు నరసరావుపేట పట్టణంలో ఈ నెల 9న జరగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆహ్వాన పత్రాన్ని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుకు నిర్వాహకులు మంగళవారం ఇచ్చి ఆహ్వానించారు. పోటీలకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని, దూర ప్రాంతాల నుండి పోటీలకు వచ్చే ఉపాధ్యాయులకు, వారి కుటుంబ సభ్యులకు వసతి సౌకర్యాలు కల్పించనున్నామని పల్నాడు బాలోత్సవం అధ్యక్ష, కార్యదర్శులు షేక్. మస్తాన్ షరీఫ్, కట్టా కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు తెలిపారు.

యూరియా కొరత తెచ్చిన ఘర్షణ

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో సచివాలయంలోని ఫర్నిచర్, వాటిపైన ఉన్న కంప్యూటర్, రెండు ప్రింటర్లు కింద పడ్డాయి. పరిస్థితి తీవ్రమవడంతో పంచాయతీ కార్యదర్శి బి.లక్ష్మీశారదకు వివిఎ హారిక సమాచారం ఇచ్చారు. కార్యదర్శి మండల స్థాయి అధికారులకు చెప్పారు. వారొచ్చి పరిశీలించిన అనంతరం వారి సూచనల మేరకు ఫర్నీచర్ ధ్వంసంపై పోలీసులకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. దీనిపై వట్టిచెరుకూరు మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సునీత మాట్లాడుతూ రైతులందరికీ సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. అందరూ సంయమనం పాటించాలని, సరైన పత్రాలను వ్యవసాయ సహాయకులకు అందించి యూరియాను తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా ఘర్షణ పడ్డవారంతా అధికార టిడిపికి చెందినవారు కావడం గమనార్హం.

పల్నాడు చిన్నారి.. అమెరికాకు దత్తత

(మొదటి పేజీ తరువాయి)

ముందుకొచ్చారు. తొలుత బ్రాడెన్ రీజ్ వెబ్ కేరింగ్ పోర్టల్ ద్వారా దత్తత స్వీకారానికి దరఖాస్తు చేసుకోగా దీన్ని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ పరిశీలించి అనుమతిచ్చింది. పాప గురించి దత్తత తల్లిదండ్రులతో జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆన్‌లైన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విభిన్న ప్రతిభావంతురాలైన పాపను దత్తత స్వీకారానికి, సంసిద్ధత గురించి నిర్ధారించుకున్నారు. దత్తత తీసుకునే తల్లిదండ్రులు తమకు పుట్టిన బిడ్డలతో సమానంగా ఈ పాప పట్ల శ్రద్ధను చూపించాలని చెప్పారు. ఇందుకు దత్తత తల్లిదండ్రులు హామీ ఇవ్వడంతోపాటు పాప కుడి కన్నుకు కూడా వైద్యం చేయిస్తామన్నారు. దీంతో దత్తత ప్రక్రియను పూర్తి చేశారు. పల్నాడు జిల్లా ఏర్పాటు అనంతరం మొదటి విదేశీ దత్తత స్వీకారం (ఇంటర్ కంట్రీ అడాప్షన్) ఇదే కావడం గమనార్హం.

సైన్స్ పట్ల అవగాహన పెరగాలి

ప్రజాశక్తి - రెంటచింతల : విద్యార్థులకు సైన్స్ పట్ల మంచి అవగాహన పెంచేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ-2 శివ నాగేశ్వరరావు చెప్పారు. జనవిజ్ఞాన వేదిక (జెవివి), యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో 8,9,10 తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దుర్గాప్రసాద్ వి.రాజ్ కుమార్, జెవివి జిల్లా కార్యదర్శి జెవికెఎస్ ప్రసాద్, వి.శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, కత్తి రవి, సుబ్బారావు, సుధీర్‌రెడ్డి, లత పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ భూసేకరణకు రూ.120 కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్ భూసేకరణకు ఒకేసారి రూ.120 కోట్లు కేటాయించి, భూసేకరణ చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని, గత 60 సంవత్సరాలుగా ప్రత్తిపాడు, పర్చూరు నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారని, ప్రభుత్వాలు మారిన ప్రతిసారి గుంటూరు ఛానల్‌కు నిధులు కేటాయించి పనులు పూర్తిచేస్తామని ప్రజాప్రతినిధులు వాగ్దానం చేసినా ఆచరణలో కార్యరూపం దాల్చలేదన్నారు. గత ప్రభుత్వంలో భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చి ఆర్‌డిఒని భూ సేకరణకు అధికారిగా నియమించారని అన్నారు. కాని నిధులు కేటాయించని కారణంగా భూ సేకరణ జరగలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మూడునెలల క్రితం ఏడు గ్రామాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి, గ్రామ సభలు నిర్వహిస్తుందన్నారు. గుంటూరు జిల్లాలో మరో నాలుగు గ్రామాలకు, బాపట్ల జిల్లాలోని పర్చూరు మండలంలో భూ సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన గ్రామాల రైతులు కూడా ప్రస్తుత మార్కెట్ ధర రూ.30 లక్షలు ఇస్తేనే తమ భూమి ఇస్తామని ఆర్‌డిఒను కోరుతున్నారన్నారు.గుంటూరు చానల్‌ను పొడిగిస్తే పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పర్చూరుకు మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాలకు త్రాగునీరు, సాగునీరు అందుతుందన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి గుంటూరు జిల్లాలోని మిగిలిన నాలుగు గ్రామాలలో భూ సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వమని ఆర్‌డిఒను ఆదేశించారన్నారు. భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం విషయం పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. తుఫాను సందర్భంగా నల్లమడ వాగుకు పడిన గండ్లు పూడ్చాలని, నల్లమడ ఆధునీకరణ పనులుకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు, నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, రైతుసంఘం నాయకులు పసుపులేటి శేషగిరి ఉన్నారు.

సచివాలయ సిబ్బందిపై జిల్లా అధికారి ఆగ్రహం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సచివాలయంలో ఇంటర్ నెట్ లేకుండా ఎలా పని చేస్తున్నారని అధికారులపై జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ సిఈఓ సిహెచ్.కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని సచివాలయం-2ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. గత ప్రభుత్వం హయాలో మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటోతో ముద్రించిన పత్రాలు, రేషన్ కార్డు కాపీలు, అప్పటి పాలనలో ప్రజలకు చేసిన పత్రాలు కట్టలు కట్టలుగా సచివాలయం మొత్తం చిందర వందరగా ఉండడాన్ని ఆయన గమనించారు. ఎలుకలు సైతం తిరుగుతుండడంతో సిబ్బందిపై ఆగ్రహం చేశారు. ఒక కంప్యూటర్, ప్రింటర్, మానిటర్ పని చేయక పోవడాన్నీ గమనించి... ఇలా ఉంటే ప్రజలకు ఏ విధంగా సేవలు అందిస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వం మారీ ఏడాదిన్నారైనా గత ప్రభుత్వం తాలూకు సామగ్రి ఎందు కుందని ప్రశ్నించారు. మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న సచివాలయం ఇలా ఉంటే మిగతా సచివాలయాలు ఎలా ఉన్నాయో అని అసహనం వ్యక్తం చేశారు.

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం

ప్రజాశక్తి - తెనాలి

గర్భస్త లింగ నిర్ధారణ నేరమని, అలాంటి చర్యలకు పాల్పడితే పిసిపిఎన్డిటి చట్ట ప్రకారం చర్యలు తప్పవని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఇ.అన్నపూర్ణ చెప్పారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై స్కానింగ్ సెంటర్లు, లేబరేటరీల నిర్వాహకులకు స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డివిజన్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్స్, ల్యాబ్ రేటరీలు లింగ నిర్ధారణకు వాణిజ్య ప్రకటనలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మొదటి సారి నిబంధనలు ఉల్లంగించిన కేంద్రాలకు మొదటి తప్పుగా మూడేళ్ల జైలు, రూ.50 వేలు జరిమానా, భారత్ వైద్య మండలి నుండి వారి ధ్రువీకరణ పత్రం ఐదేళ్ల పాటు తొలగించబడుతుందని చెప్పారు. రెండవసారి లింగ నిర్ధారణకు పాల్పడితే ఐదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానాతోపాటు వారి ధ్రువీకరణ పత్రం శాశ్వతంగా తొలగిస్తామని వివరించారు. కమిటీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, డాక్టర్ నరేంద్ర సింగ్, డాక్టర్ వినీల్, రెడ్ క్రాస్ సభ్యులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్యూ ఎస్ ఆసియా ర్యాంకుల్లో మెరిసిన ఎఎన్‌యు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకుల్లో మరోసారి మెరిసింది. మంగళవారం ప్రకటించిన ర్యాంకుల్లో వర్సిటీ 761 నుంచి 770తో రాష్ట్రంలో తొలి స్థానంలో నిలిచింది. ఆంధ్ర యూనివర్సిటీ 81 నుంచి 850, జేఎన్టీయూ అనంతపురం 801 నుంచి 850, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ 851-900, శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ 1001 నుంచి 1100వ ర్యాంకుల్లో స్థానాలు పొందాయి. ముందువరుసలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిలవడంపై ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావు, ఇతర అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

వైద్యుల ఇంట్లో భారీ చోరీ?

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో వైద్య దంపతుల ఇంటిలో భారీ చోరీ జరిగింది. దీనిపై పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. విషయం బయటకు పొక్కకుండా విచారణ చేపట్టారు. రైల్వే స్టేషన్ రోడ్డులో గల ఓ ప్రైవేటు వైద్యశాలను నిర్వహించే వైద్య దంపతుల ఇంటిలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు తెలిసింది. పెద్ద ఎత్తున బంగారం, నగదు అపహరణకు గురికాగా, క్లూస్ టీం కూడా వచ్చి ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

కబడ్డీ ఎంపికలకు వేదికగా వశిష్ట జూనియర్ కళాశాల

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేట పట్టణంలోని వశిష్ట జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన కళాశాల డైరెక్టర్ మద్దుల నరేష్ కుమార్ మాట్లాడుతూ అసోసియేషన్ సబ్ జూనియర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు తమ కళాశాల వేధిక కావడం సంతోషంగా ఉందన్నారు. తమ కళాశాల విద్యార్థులకు అనుభవం కలిగిన అధ్యాపకులచే విద్యా బోధనతో పాటు ఉత్తమ ప్రతిభ కలిగిన కోచ్‌లతో శిక్షణిప్పిస్తున్నామని, క్రీడల పట్ల విద్యార్థుల ఆసక్తి పెంచేలా ప్రోత్సహించడంతో పాటు ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సైతం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామని అన్నారు. క్రీడలు మానసిక పునరుత్తేజానికి, శరీర దారుఢ్యానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కబడ్డీ సెక్రటరీ తేజ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ చిరంజీవి, పల్నాడు జిల్లా కార్యదర్శి ఎం.సురేష్, కళాశాల చైర్మన్ మద్దుల కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ నర్రా శేషగిరిరావు, కళాశాల డైరెక్టర్ నల్లపాటి శ్రీకాంత్, భవిరిశెట్టి మదన రాజారావు, ప్రిన్సిపల్ శివనాగేశ్వరరావు, కళాశాల పీడీ వై,సురేష్, పీడీలు జి.నరసింహారావు, పుల్లయ్య, ఎలమంద, రామారావు పాల్గొన్నారు.



గంజాయి సేవిస్తున్న నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : మండలంలోని జగ్గడిగుంటపాలెం పొలాల్లో గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను మంగళవారం తెనాలి రూరల్ సిఐ ఉమేష్, రెవిన్యూ సిబ్బంది మూకుమ్మడి దాడిచేసి అరెస్టు చేశారు. వారి నుంచి 100 గ్రాములు బరువు కలిగిన నాలుగు గంజాయి పొట్లాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు పట్టుబడిన వారిలో తెనాలికి చెందిన సిద్దార్థ, వంశి, సూర్యతేజ, మణి గోపాల్ లు ఉన్నారు. వారిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఉమేష్ తెలిపారు.

పంచాయతీల్లో సమూల మార్పులు


(మొదటి పేజీ తరువాయి)

నిధుల నుంచి చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐటి విభాగం కూడా ప్రతి పంచాయతీల్లో ఉండాలని నిర్ధేశించారు. గ్రామ పంచాయతీల మొత్తం డిజిటలైజేషన్‌కు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తారు. అన్ని ఖాళీలతో పాటు పంచాయతీ అభివృద్ధి అధికారులను కూడా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా నియమించాలని ఆదేశించారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టుల అప్‌గ్రేడేషన్‌లో భాగంగా జూనియర్ అసిస్టెంట్-కమ్-బిల్ కలెక్టర్ పోస్టులను సీనియర్ అసిస్టెంట్ పోస్టులుగా ప్రమోషన్ కల్పించి రూర్బన్ పంచాయతీల్లో నియమిస్తారు.

గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుండి ఖర్చు భరించడం ద్వారా పారిశుధ్య విభాగం, నీటి సరఫరా విభాగం, కంట్రీ ప్లానింగ్ విభాగం, స్ట్రీట్ లైటింగ్, ఇంజనీరింగ్ విభాగం, రెవెన్యూ విభాగం కలిగిన సూచిక సిబ్బంది నమూనాను ఆమోదించడం, అవుట్‌సోర్సింగ్/కాంట్రాక్ట్ సిబ్బంది జీతాల కోసం సమర్థవంతమైన సేవల అందించేందుకు, వారి ఖర్చును భరించేందుకు పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించేలా కృషి చేయాలని నిర్ణయించారు. బిల్డింగ్, లే అవుట్ నిబంధనల అమలు కోసం ప్రస్తుతం సచివాలయాల్లో ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లను కంట్రి ప్లానింగ్ అసిస్టెంట్లుగా నియమించడం, వారి రెగ్యులర్ విలేజ్ సెక్రటేరియట్ విధులతో పాటు పనిచేయిస్తారు. మినిస్టీరియల్, ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల మధ్య ప్రమోషన్ మార్గాన్ని ఆమోదించడం, రెండు కేడర్లకు సమాన అవకాశాల కోసం సర్వీస్ రూల్స్‌లో సవరణలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రమోషన్లకు శిక్షణ తప్పని సరి చేశారు. ఇందులో భాగంగా ఇంటర్-కేడర్ ప్రమోషన్లకు రెండు వారాల సంస్థాగత శిక్షణ ఒక సంవత్సరం ఆన్-జాబ్ శిక్షణ అవసరమని నిర్ణయించారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన హరిదాసు

ప్రజాశక్తి - మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ బోర్డ్ డైరెక్టర్‌గా నియమితులైన నిడమర్రు గ్రామానికి చెందిన బత్తుల హరిదాసు కుటుంబ సమేతంగా ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 9వ తేదీన జరిగే ప్రమాణ స్వీకారానికి మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించినట్లుగా హరిదాసు తెలిపారు.



భవన నిర్మాణ కార్మికునికి సంఘం నివాళి

ప్రజాశక్తి - సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణం సీనియర్ భవన నిర్మాణ కార్మికుడు (తాపీ మేస్త్రి) కొత్త నరసింహా రావు (62) అనారోగ్యంతో మతి చెందారు. ఆయన మృతికి పలనాడు భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు నివాళులర్పించింది. కొత్త నరసింహారావు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పల్నాడు భావన ఇతర నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు అవ్వారు ప్రసాద్‌రావు, తోటి భవనిర్మాణ కార్మికులు నరసింహారావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. నరసింహారావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నరసింహా రావు అంత్యక్రియలు బుధవారం ఉదయం జరుగుతాయని కుటుం బ సభ్యులు తెలిపారు. నరసింహ సందర్శించి నివాళులర్పించిన వారి లో భవన నిర్మాణ కార్మి క సంఘం నాయకులు గొట్టం కొండలు ఎం. హరి పోతురాజు చిన్నం మస్తాన్రావు, వెంకటప్పయ్య, సత్తెనపల్లి హరిబాబు పాల్గొని నరసింహారావు భౌతికకాయానికి నివాళులర్పించారు.



నివాళి అర్పిస్తున్న సిఐటియు నాయకులు

పాస్‌పోర్టు పోయినవి

పూసల నవీన్ చౌదరి, తండ్రి సీతా రామయ్య, డోర్.నం.2-69,బొప్పూడి గ్రామం, చిలకలూరిపేట మం. పల్నాడు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్, 522626.. అను నేను తెలియ చేయు నది. నాయొక్క పాస్ పోర్ట్ నం. **N 6110592** గల ఒరిజినల్ పాస్‌పోర్ట్‌ను తేదీ. 28.10.2025న నా ఇంటి నుంచి ఫొటోస్టాట్ తీయించు నిమిత్తం తీసుకుని చిలకలూరిపేటలో ఎన్.ఆర్.టి. సెంటర్ వద్దకు పోయి చూసుకొనగా లేదు. ఎక్కడో దారిమధ్యలో పడిపోయినది. వెతికినను దొరక లేదు. దొరికిన వారు పైఅడ్రస్ కు తెచ్చి ఇవ్వ గలరు. లేదా సెల్ నం. 9014138181 కి ఫోన్ చెయ్యగలరు.

సర్టిఫికెట్స్ పోయినవి

గుంటూరు జిల్లా, తెనాలి గంగనమ్మపేట, లెక్చరర్ కాలనీ నివాసి అయిన **పులికొండ రంగనాథ గుప్త** అను నాకు సంబంధించిన విమటా లాబ్స్ లిమిటెడ్ కంపెనీకి చెందిన షేర్ సర్టిఫికెట్స్ పోయినవి. అక్టోబర్ 03, 2025 తేదీన జిరాక్స్ నిమిత్తం నివాస ఇంటినుండి మార్కెట్ ఏరియాకి ఆటోలో వెళుతుండగా విమటా లాబ్స్ లిమిటెడ్ కంపెనీ సర్టిఫికెట్స్ వున్న బ్యాగ్ పోయినది. సంబంధిత సర్టిఫికెట్స్ వున్న బ్యాగ్ దొరికిన యెడల ఈ కింది అడ్రస్సుకి తెలుపగలరు.

ఇట్లు
పులికొండ రంగనాథ గుప్త
గంగానమ్మపేట, లెక్చరర్ కాలనీ,
డో॥నెం॥ 7-5-25/5, ఫ్లాట్.నెం:202 ,
మహేశ్వరి అపార్ట్‌మెంట్, తెనాలి,
గుంటూరు జిల్లా. సెల్:9347623952

విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు చోరీ

ప్రజాశక్తి - నకరికల్లు

పొలాల్లోని విద్యుత్‌ట్రాన్స్ ఫారాలను దొంగలు పగలగొట్టి ఆయిల్, రాగి తీగల ను కొల్లగొడుతున్నారు. నకరికల్లు మండ లంలోని పలు గ్రామాలలో ఆరు నెలల వ్యవధిలో 19ట్రాన్స్ ఫారాలను దొంగలిం చారు. వాటిపై ఆరుకేసులు నమోదు చేసి నట్లు పోలీసులు తెలిపారు. సోమ వారం రాత్రి నకరికల్లు చెరువు దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫారాన్ని దొంగలు పగలగొట్ట డం తో రైతులు మంగళవారం ఫిర్యాదు చేశా రు. పంట చేతికొచ్చే సమయంలో విద్యు త్ ట్రాన్స్‌ఫారాలను దొంగలు పగల గొట్ట డంతో రైతులు గగ్గోలుపెడుతున్నారు. గ్రామాలలో జరిగే దొంగ తనాలపైనా పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరు తున్నారు.



దుండగులు ఎత్తుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్

నోటీసు
మహారాజశ్రీ తెనాలి 2వ అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం.374/2024

బిట్వీన్ :
Kami Reddy Thirupathamma
W/o Chenna Reddy, age 48 Years
Ganganamma Pet Tenali ..... వాది
ఎదిరి
Shaik Ayesha .... ప్రతివాది
To,
Shaik Ayesha W/o Baji, 50 years,
D.No.14-46, Telaprolu villege,
Tenali mandal, Guntur Dist

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను సమన్లు చేయించినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు ఆర్డరు వేస్తూ మీ హాజరు కొరకు ది.12-11-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది : 12-11-2025

ఎ.పి.పూర్ణారెడ్డి,
బి.వి.నిఖిల్ శాండిల్య,
వాది తరపు అడ్వకేట్స్,
తెనాలి.
సెల్: 9010439368.

నోటీసు
మహారాజశ్రీ తెనాలి 2వ అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం.695/2024

బిట్‌వీన్ :
Peracharla Yallaiah, S/o Papaiah
Ramalingeswarapet, Tenali ..... వాది
ఎదిరి
Mudraboina Gopala Rao .... ప్రతివాది
To,
Mudraboina Gopala Rao, Attender,
S/o Subba Rao O/o Revenue Section
Tenali Municipality Tenali, Gunturu Dist.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను సమన్లు చేయించినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు ఆర్డరు వేస్తూ మీ హాజరు కొరకు ది.12-11-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది : 12-11-2025

ఎస్.బి.నిఖిల్,
వాది తరఫు అడ్వకేట్, తెనాలి.
సెల్: 9010439368

నోటీసు
మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఈ.పి. నెం.38/2025 ఇన్ ఓ.యస్.నెం.246/2005

బిట్వీన్ :
M/s Vijaya Lakshmi Finance Corporation, rep by its Managing Partner and foremen, Tadepalli Sivalingeswara Rao ..... డిహెచ్‌ఆర్
ఎదిరి
V.Rosi Reddy and others .... జెడిఆర్స్
To,
4th JDR : Alla Ravindranath Reddy, S/o Late Rajeswara Reddy, age 55 years, Modukuru Village, Tsunduru Mandal, Bapatla Dist.

పై నెంబరు ఈ.పి.లో మీకు శ్రీ కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను ఆర్డర్ 21 రూల్ 22 నోటీసులు చేయించినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు ఆర్డరు వేస్తూ మీ హాజరు కొరకు ది.11-11-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు ఈ.పి. మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది : 11-11-2025

కె.వెంకటేశ్వరరావు,
డిహెచ్‌ఆర్ తపు అడ్వకేట్,
తెనాలి.
సెల్: 9849414350.

పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని వంకాయల పాడు గ్రామం శివారులో సోమ ారం రాత్రి 12:30 గంటల సమయంలో కోత ముక్క ఆడు తున్న వారిపై పోలీసులు దాడి చేసి అయిదు గురిని అదుపులోకి తీసు కున్నారు. వారి నుంచి నగదు రూ.15,300లే స్వాధీనం చేసు కున్నారు. కోతముక్క, కోడి పందేలు లాంటి కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచు తామని పోలీసులు తెలిపారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలను గమనిం చిన వెంటనే పోలీసులకు సమా చారం అందించాలని చెప్పారు.

మద్యం తాగి దాడులు చేసుకున్న యువకులు

ప్రజాశక్తి - క్రోసూరు

మద్యం మత్తులో సీసాలు పగల కొట్టి ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని పొడుచుకున్న సంఘటన మండల కేంద్రం క్రోసూరులోని మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న వెంకటేశ్వర వైన్స్ వద్ద మంగళ వారం జరిగింది ఈ సంఘటనలో క్రోసూరు ఎస్సీ కాలనీకి చెందిన చిలక రవికుమార్, చిలక కోటేశ్వర రావు ఫుల్లుగా మద్యం తాగి సీసాలు పగలగొట్టి ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని పగిలిన సీసాల తో పొడుచుకున్నట్లు పోలీసులు తెలియజేశారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా సత్తనపల్లి ప్రభు త్వాసుపత్రికి తరలించినట్లు చెప్పా రు. పరస్పరం హత్య ప్రయత్నం జరిగినట్లు ఫిర్యాదు చేసుకోగా ఇరువురి పైనా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వీరిలో చిలక రవికుమార్‌పై క్రోసూరు పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే రౌడీషీట్ ఉంది. క్రోసూరు ఎస్సై పి.రవిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

BEFORE THE HONOURABLE CO-OPERATIVE TRIBUNAL OF ANDHRA PRADESH AT VIJAYAWADA
O.P No. 95 of 2025

Between:
Peoples Mutually Aided Co-operative Credit Society Limited, Rep by its Authorized Signatory ....Petitioner
AND
Chilaka Naga Malli & 3 Others .....Respondents

To,
Respondent-1&3
R-1, Chilaka Nagamalli, S/o. Koteswara Rao, R/o. D.No.12-1460/2, Vengala Reddy Nagar,Chilakaluripeta,H/o.Purushothapatnam, Palnadu Dt, Pin-522616
R-3, Chilaka Therisa, W/o. Naga Malli, R/o. D.No.12-1460/2, Vengala Reddy Nagar, Chilakaluripeta, H/o. Purushothapatnam, Palnadu Dt, Pin-522616

You are hereby informed that in the above proceedings, you have to appear before the above Honourable court, on 26-11-2025, at 10:30 a.m. either in person or through your advocate. In case of your non appearance before the above Honourable court, the matter will be adjudicated in your absence.

B.O
U.R.P. Srinivas,
Advocate,
F-1, Ankur Complex,
Governorpet.

VIJAYAWADA,
Dt.01.11.2025.



వర్షాలకు కుంగిన రహదారి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మొంథా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఆర్ అండ్ బి రోడ్లు కుంగిపోయాయి. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన సమీపంలో రోడ్డు దెబ్బతిని ప్రమాద భరితంగా మారింది. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి.



సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు అవ్వారు ప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక గార్లపాడు బస్టాండ్ సెంటర్లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. జనవరి 4న జరిగే బహిరంగ సభకు అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆవిష్కరణలో సిఐటియు పట్టణ కన్వీనర్ జె.రాజ్ కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జి.ఏడుకొండలు, దాసు, సాల్మన్ రాజు, ఎం.హరిపోతురాజు, కార్మికులు పాల్గొన్నారు.

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులొద్దు

ప్రజాశక్తి - వినుకొండ

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను ఉపసంహరించాలని, పెండింగ్‌లో ఉన్న ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఏఓఐ) వినుకొండ బ్రాంచ్ అధ్యక్షుడు బొంకూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఎల్ఐసి ఏవోఐ సౌత్ సెంట్రల్ జోన్ 6వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎల్ఐసిలో వస్తున్న మార్పులు ఏజెంట్లను ఇబ్బందులు గురిచేస్తున్నాయన్నారు. ఏజెంట్లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, బీమా షుగర్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. క్లబ్ బ్యాక్ క్లాజ్ నిలుపుదల చేయాలని, ప్రతి పాలసీపై గరిష్ట వయస్సును 55కు పెంచాలని, క్లబ్, క్లియ ఏజెంట్లను పరిరక్షించాలని, మొదటి సంవత్సరం కమిషన్ పాత పద్ధతిలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.నవీన్ కుమార్, ఎ.నరసింహారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



జెవివి చెకుముకి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికలు



ప్రజాశక్తి - వినుకొండ

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సంబరాల్లో భాగంగా మండల స్థాయి పోటీలను స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. మండలంలోని 14 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు హాజరవగా ఐదు పాఠశాలల నుండి విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో వినుకొండ జెడ్‌పి బాలికల పాఠశాల, నిర్మల హైస్కూల్, గీతమ్ హైస్కూల్, వివేకానంద హైస్కూల్, చీకటిగలపాలెం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులున్నారు. వీరిలో జిల్లా స్థాయికి గీతం హైస్కూల్, వినుకొండ జెడ్‌పి బాలికల పాఠశాల, చీకటిగలపాలెం మోడల్ స్కూల్‌ను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. 23న జిల్లాస్థాయి పరీక్షలుంటాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులను కౌన్సిలర్ షకీలా అందజేశారు. జెవివి కార్యదర్శి బి.రవికుమార్, జిల్లా గౌరవాధ్యక్షులు నాగేశ్వరావు, కోశాధికారి రఘు మాస్టారు, సాంబశివరావు, శేఖర్, రేణుక పాల్గొన్నారు.



శావల్యాపురంలోని జెడ్‌పి పాఠశాలలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు.వేల్పూరు, పొట్లూరు, మతుకుమల్లి, శావల్యాపురం పాఠశాలల నుండి విద్యార్థులు హాజరయ్యారు. వేల్పూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు చెన్నా లోహిత, గోరంట్ల గాయత్రి, జూపల్లి విష్ణువర్ధన్ ప్రథమ స్థానం సాధించారు. మతుకుమల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు మణి తేజ, కుసుమ, తేజశ్రీ ద్వితీయ స్థానం, శావల్యాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీ



నాగలక్ష్మి, జాన్ వెస్లీ, తరుణ్ రమేష్ తృతీయ స్థానం దక్కించుకున్నారు. ప్రథమ స్థానం సాధించిన వేల్పూరు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జెవివి నాయకులు కెవిఆర్ మోహన్‌చంద్ తెలిపారు. హెచ్ఎం బి.విజయలక్ష్మి, బయాలజీ ఉపాధ్యాయులు సుభాష్ చంద్ర రెడ్డి, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.ప్రసాద్, జన విజ్ఞాన వేదిక మండల కమిటీ అధ్యక్షులు ఎ.వసంతరావు, ప్రధాన కార్యదర్శి బి.త్రివిక్రమ్, జ్యోతి శ్రీనివాసరావు, పి.సురేష్, ఎలిక శ్రీనివాసరావు, కె.జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు కిరణ్మయి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక జెడ్‌పి పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీల్లో మండలంలోని కొచ్చర్ల, కొండ్రముట్ల, ఇనిమెళ్ల, ఎ.ముప్పాళ్ల, ఈపూరు, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కొండ్రుముట్ల జెడ్‌పి పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎజెఎం శ్రీనివాసరావు తెలిపారు.

వికలాంగులకు వాహనాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఉమ్మడి గుంటూరు జిల్లా దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి.దుర్గాభాయి

దివ్యాంగులకు నూరుశాతం సబ్సిడీపై రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ (3 చక్రాల మోటార్) వాహనాల మంజూరుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి.దుర్గాభాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నాటికి 18 నుండి 45 ఏళ్ల వారు అర్హులని, దరఖాస్తుదారులు ఒకటి లేదా రెండు కింద భాగాలు (లోయర్ లింబ్స్) ప్రభావితమై 70 శాతం కంటే ఎక్కువ లోకో మోటార్ వైకల్యం ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు కంటే ఎక్కువ ఉండరాదని పేర్కొన్నారు. వాహనం నడపడానికి చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థల ద్వారా ఇంతకు ముందు ఏ మోటరైజ్డ్ వాహనాన్ని పొంది ఉండరాదని తెలిపారు. సహాయ ఉపకరణాలతో నడవని వారు అర్హులు కాదని తెలిపారు. గ్రాడ్యుయేషన్ లేదా అంతకంటే పై స్థాయి కోర్సులు రెగ్యులర్ పద్ధతిలో చదువుతున్న విద్యార్థులై ఉండాలని, స్వయం ఉపాధి, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు లేదా కనీసం ఒక ఏడాది అనుభవం ఉన్న జీతం/వేతనం ఉద్యోగులు అర్హులని పేర్కొన్నారు. అర్హులు ఆంధ్రప్రదేశ్ దివ్యాంగులు వృద్ధుల సహాయ సంస్థ (APDASCAC) అధికారిక వెబ్‌సైట్‌లో www.apdascac.ap.gov.in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తులు పరిశీలన ఉంటుందని, కమిటీకి జాయింట్ కలెక్టర్ అధ్యక్షత వహిస్తారని, వాహనాల మంజూరు బడ్జెట్ లభ్యతపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. వికలాంగుల ధ్రువపత్రం, ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సి సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, తాజా ఆదాయ ధ్రువపత్రం, బోనాఫైడ్ సర్టిఫికెట్ (విద్యార్థుల కోసం)/ఉపాధి ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, గతంలో వాహనం పొందలేదని ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

యువజనోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - మాచర్ల

రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో కెసిపి క్యాంటీన్ వద్ద వారం రోజులపాటు సాగే యువజనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎంబీఎస్ కోటేశ్వరరావు, సయ్యద్ రబ్బాని వ్యవహరించారు. చెస్, డ్రాయింగ్, క్విజ్, క్లాసికల్ డ్యాన్స్ తదితర అంశాల్లో పోటీలుంటాయని ప్రోగ్రాం కన్వీనర్ ఇక్కుర్తి శంకర్ తెలిపారు. ఆదివారం సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో లాంగ్ జంప్, హై జంప్, సైక్లింగ్, రన్నింగ్, షార్ట్ పుట్ తదితర క్రీడాంశాల్లో



వ్యాచరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు

పోటీలుంటాయన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల సత్యప్రసాద్,సెక్రెటరీ కోటేశ్వరరావు, న్యూ జనరేషన్ డైరెక్టర్ అన్నపురెడ్డి నాగార్జునరెడ్డి, జిల్లా 3150డిస్ట్రిక్ట్ డిసీజెస్ అండ్ ప్రివెన్షన్ చైర్మన్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, షేక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : ఎంఇఒ సురేష్



ప్రజాశక్తి - మాచర్ల : చదువుతో పాటు ఆటల్లో రాణించడం వల్ల ఆత్మవిశ్వాసం, సామాజిక నైపుణ్యాలు, క్రమశిక్షణ పెరుగుతాయని మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మాచర్ల సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో మంగళవారం ప్రైవేట్ స్కూల్ ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌ను స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ తుమ్మ సుజాతతో కలసి ఎంఇఒ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు మాచర్ల పట్టణంలోని 12 ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత ఎంఈఓ అల్లి సురేష్, సిస్టర్ తుమ్మ సుజాత, కిడ్స్ పాఠశాల ప్రిన్సిపల్ రామకృష్ణ శాస్త్రి, ప్రైవేట్ స్కూల్స్ యూనియన్ అధ్యక్షులు రమణలు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎంఇఒ మాట్లాడుతూ క్రీడలు ఒత్తిడిని తగ్గించి, మానసిక ఆనందాన్ని ఇస్తాయని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించడం నేర్పుతుందని అన్నారు. తుమ్మ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు చదువుకు ప్రాధాన్యమిస్తూనే, తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో కూడా కృషి చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన ఇస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిస్టర్ శ్వేత, పిఈటి మత్తె కుమార్, సంతోష్, రత్న ప్రకాష్, వెంకట్ ప్రతాప్, నాగేశ్వరరావు, వీనేష్, శ్రీను, శౌరి రాజు, వర్షిని, మెర్సీ, అనూష పాల్గొన్నారు.




మద్దతు ధరల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : కేంద్ర ప్రభుత్వం 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం ప్రకటించిన కనీస మద్దతు ధర పోస్టర్‌ను నరసరావుపేటలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం ఆవిష్కరించారు. మద్దతు ధరల ద్వారా రైతుల ఉత్పాదన ఖర్చుపై 50 నుండి 63 శాతం వరకు రెట్టింపు అవుతుందన్నారు. సజ్జ 63 శాతం, మొక్కజొన్న 59 శాతం, అపరాలకు 59 శాతం లాభం ఉంటుందన్నారు. నూనె గింజలు, పప్పు ధాన్యాలు, పోషక తణధాన్యాల సాగును ప్రోత్సహించేలా ధరలున్నాయని చెప్పారు. రైతు సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట, రొంపిచర్ల మార్కెట్ యార్డు చైర్మన్‌లు పి.శ్రీనివాసరావు, ఎం.రాణి రామారావు, నాయకులు పి.జగ్గయ్య పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పతకం సాధించిన రాకేష్ రణధీర్ యాదవ్‌కు సత్కారం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : అండర్-19 రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 79 కిలోల విభాగంలో తృతీయ స్థానం సాధించి పట్టణానికి, కళాశాలకు రాకేష్ రణధీర్ యాదవ్ గౌరవం తెచ్చాడని పట్టణ సిఐ వెంకటరమణ అన్నారు. మంగళగిరి నియోజకవర్గం రేవేంద్రపాడులో గత నెల 24, 25, 26 తేదీల్లో జరిగిన పోటీల్లో పట్టణానికి చెందిన రాకేష్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో మంగళవారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సిఐ వెంకటరమణ హాజరై రాకేష్ రణధీర్‌ను సన్మానించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ప్రతి విద్యార్థి పట్టుదలతో చదువుకుని, మంచి ఉద్యోగాలు సాధించి సమాజంలో గౌరవ స్థానం సంపాదించాలని సూచించారు. రాకేష్ రణధీర్ చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో విజయం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



తొలగించిన 35 మంది ఎయిమ్స్ కార్మికుల్ని వెంటనే పనిలోకి తీసుకోవాలి

ఎయిమ్స్ రోడ్డులో కార్మికులు నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎయిమ్స్‌లో తొలగించిన 35 మంది గార్డెనింగ్ వర్కర్లను వెంటనే పనిలోకి తీసుకోవాలని మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. మంగళవారం మధ్యాహ్నం మంగళగిరి ఎయిమ్స్ రోడ్డులో తొలగించిన కార్మికులు వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ కార్మికులకు చెప్పకుండా పనిలోంచి తీసివేయడం దారుణమైన అన్నారు. గత ఐదు సంవత్సరాలగా గార్డెనింగ్ కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. కాంట్రాక్టర్ ఈనెల 1వ తేదీన కార్మికులకు వేతనాలు చెల్లించి, కాంట్రాక్ట్ రద్దు అయిందని ఇక పనికి రావద్దని చెప్పడం సరికాదని అన్నారు. ఐదు సంవత్సరాలలో వేతనాలు పూర్తిగా చెల్లించకుండా లక్షలాది రూపాయలు కాంట్రాక్టర్ దోసుకున్నారని అన్నారు. ఒక్కొక్క మహిళా కార్మికులకు 18000 గాను 12,500 మాత్రమే చెల్లించారని అన్నారు. పురుషులకు 14,500 చెల్లించడం జరిగిందని అన్నారు. వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా దోపిడీ చేయడం జరిగిందని అన్నారు. కాంట్రాక్టర్ రద్దయిందని పనిలోకి రావద్దని చెప్పడం సరికాదని అన్నారు. కొత్త కాంట్రాక్టర్ వచ్చిన వీళ్ళనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గతంలో ఎయిమ్స్ సెక్యూరిటీ గార్డులుగా పనిచేసిన వర్కర్లకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తొలగించిన గార్డెనింగ్ కార్మికులను వెంటనే పనిలో తీసుకునే అంతవరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వెంటనే ఎయిమ్స్ అధికారులు, డైరెక్టర్ స్పందించి పనిలోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంగళగిరి ఎయిమ్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎం బాలాజీ, ఆటో యూనియన్ నాయకులు షేక్ కాజా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎయిమ్స్ కార్మికులు



సమావేశంలో మాట్లాడుతున్న వై నేతాజీ

కౌలు రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

తుపాను వలన పంట నష్టపోయిన కౌలు రైతులందరినీ నష్టపరిహారం అందించి, ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో సోమవారం రాత్రి సిపిఎం సమావేశం సీనియర్ నాయకులు నాగ పోగు విజయ రాజు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో నేతాజీ మాట్లాడుతూ ఇటీవల అధిక వర్షాలు, భారీ వర్షాలే కాకుండా, తుపాను ప్రభావంతో కౌలు రైతులు వేసిన పంటలు నీట మునిగాయని అన్నారు. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి, నష్టపోయిన కౌలు రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తాడేపల్లి మండలంలో వివిధ గ్రామాలలో లక్షల, వేల రూపాయల పెట్టుబడులు పెట్టిన కౌలు రైతులు చేతికి అంది వచ్చిన పంటలు నీట మునిగాయన్నారు. ఈ ప్రాంతంలో పంట పొలాల్లో డ్రైనేజీ కాలువలు పూడుగు పోవడంతో పొలాలలో నిలిచిన వర్షపు నీరు బయటకు పోయే దారి లేక పంటలన్నీ ఉరకేశాయన్నారు. పంట నివారణ సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులు చొరవ చూపి, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు అమ్మిశెట్టి రంగారావు, కంచర్ల సాంబశివరావు పాల్గొన్నారు.

29,30 తేదీల్లో అరవింద మోడల్ స్కూల్లో బాలోత్సవం

ప్రజాశక్తి- తాడేపల్లి

బాలోత్సవంలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు సంపూర్ణ పరిపూర్ణత, అవగాహన సాధిస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం3 వ పిల్లల పండుగ సన్నాక సమావేశం మంగళవారం రాయల్ బ్లాంకెట్ హాల్లో నిర్వహించారు. ఈనెల 29,30 తేదీల్లో మంగళగిరి అరవింద మోడల్ స్కూల్లో పోటీలు నిర్వహించబడతాయని చెప్పారు. సుమారు 40 రకాల పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆటల్లో పాల్గొనడం ద్వారా జీవన ప్రమాణాలు పెరుగుతాయని నిపుణులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ర్యాంకులు, మార్కులు, పుస్తకాలు బట్టి పట్టడం లాంటివి కాకుండా, సమాజంలో జరుగుతున్న పరిణామాలను గమనించే విద్యార్థులు బాగా రాణించగలుగుతున్నారని చెప్పారు. బాలల భవిష్యత్తు కోసం బాలోత్సవం, మార్పు కోసం బాలోత్సవం నినాదంతో జరుగుతున్న పిల్లల పండుగను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఎం టి ఎంసీ బాలోత్సవం మూడవ పిల్లల పండుగ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాలోత్సవం అధ్యక్షులు వీసం వెంకటప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆర్ శాంతి రెడ్డి, కార్యదర్శి ప్రగడ రాజశేఖర్, ఉపాధ్యక్షులు జి.ఎస్.ఆర్ మోహన్ రావు, మంగళగిరి అరవింద మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అరవింద, యుటిఎఫ్ నాయకులు యు రాజశేఖర్, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి బాలాజీ గుప్తా, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి వీసం వెంకటేశ్వరరావు, విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, జాషువా సాంస్కృతిక వేదిక న్యాత్ర ఐజాక్, విజ్ఞాన కేంద్రాల బాధ్యులు పి విజయ, కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న శంకరరావు

బిసిల సమస్యలపై 9న రాష్ట్ర సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

బిసిల సమస్యలపై ఈనెల 9న విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో బిసిలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జనగణనతోపాటే సమగ్ర కులగణనను శాస్త్రీయంగా నిర్వహించి, జనాభా దామాషా మేరకు బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్ధానాలైన చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నా, ముందుగా కుల గణన చేయటం తప్పనిసరి అన్నారు. బీసీలలో ఏఏ కులాలవారు ఎంతమంది ఉన్నారో తెలియకుండా, ఎవరికి ఎంతని రిజర్వేషన్లు అమలు చేయాలో తెలియదన్నారు. న్యాయపరమైన సమస్యలు రాకుండా, డెడికేషన్ కమిషన్ ద్వారా సరైన డేటాతో సమగ్ర కులగణన చేపట్టాలన్నారు. అదే విధంగా బిసిలో అందరికీ సమన్యాయం జరగాలంటే ఎబిసిడి వర్గీకరణ జరగాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోగా కులగణణ పూర్తి చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ఓబిసి సబ్- ప్లాన్ రూపొందించి, ఆ మేరకు బడ్జెట్లో కేటాయింపులు చేయాలని, ప్రత్యేక నోడల్ ఏజెన్సీ ద్వారా సక్రమంగా అమలు జరపాలన్నారు. ఓబీసీ మహిళలకు సబ్-కోటా కేటాయిస్తూ, చట్టసభలలో 33 శాతం మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని సవరించి అమలు చేయాలన్నారు. ఎన్నికల వాగ్దానం మేరకు రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం చేసి వెంటనే అమలు జరపాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు కన్నా మాస్టర్, రాష్ట్ర యువజన అధ్యక్షులు పి.మహేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలా మణికంం, భాస్కర్ పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తెనాలి

విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 4 వరకు నిర్వహించే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు వై నేతాజి పిలుపునిచ్చారు. ఆశా డే సందర్భంగా మంగళవారం సంఘం జాగర్ల మూడి పిహెచ్సీ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం నలుమూలల నుండి కార్మిక పోరాటాల లో కాకలు తీరిన నాయకులు వెయ్యి మందికి పైగా సభల్లో పాల్గొంటారని చెప్పారు. ఐదు రోజుల పాటు జరిగే ఆ మహాసభల్లో దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి, పరిష్కారానికి దశగా కార్యాచరణ ప్రకటిస్తారని చెప్పారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, నేషనల్ హెల్త్ మిషన్ క్రింద పనిచేస్తున్న స్కీమ్ వర్కర్స్ కు ఉద్యోగ భద్రత లేదని, కనీస వేతనాలు లేవని, పని భారం పెరుగిందని ఆయన చెప్పారు. ఆయా అంశాలపై చర్చించి మహాసభలలో పోరాట రూపంలో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



9న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తక సమీక్ష సభ

ప్రజాశక్తి - గుంటూరు

ఈనెల 9వ తేదీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమగ్ర జీవిత చరిత్ర ఐకానోక్లాస్ట్ పుస్తక సమీక్ష సభ జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం బ్రాడీపేట లోని యూటీఎఫ్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తుల విల్సన్ ఆధ్వర్యంలో భారత్ బచావో రాష్ట్ర నాయకులు కోలా నవ జ్యోతి అధ్యక్షతన ఐకానోక్లాస్ట్ పుస్తక సమీక్ష సభ ఆహ్వాన పత్రాలను మిగతా ప్రముఖులతో కలిసి కె.ఎస్. లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమగ్ర జీవిత చరిత్ర ఐకానో క్లాస్ట్ పుస్తకాన్ని యుటిఎఫ్ హాలులో ఉస్మానియా యూనివర్సిటీ రాజనీతి శాస్త్రం విభాగ అధ్యక్షులు ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు సమీక్ష చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మార్క్సిస్టు మేధావి రమేష్ పట్నాయక్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు పెనుగొండ లక్ష్మీనారాయణ పాపినేని శివశంకర్, కవి బి.విల్సన్ పాల్గొన్నారు.

కొరిటపాడు వాకింగ్‌ట్రాక్ అభివృద్ధికి రూ.6 లక్షలు విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతూ, ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించే కార్యక్రమాలకు సంస్థలు, వ్యక్తులు ముందుకు రావడం అభినందనీయమని గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. కొరిటెపాడు వాకింగ్‌ట్రాక్ అభివద్ధి, నూతన జిమ్ పరికరాల కొనుగోలుకు వెంకటేష్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత పులివర్తి శేషగిరిరావు, ప్రధాన్ హాస్పిటల్స్ సంయుక్తంగా రూ.6లక్షలు విరాళం అందించారు. మంగళవారం మేయర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చేతుల మీదుగా కొరిటెపాడు వాకింగ్‌ట్రాక్ ప్రెసిడెంట్ కన్నసాని బాజికి చెక్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాకింగ్‌ట్రాక్ అభివద్ధికి దాతల సహకారం ఎంతో ముఖ్యమని, పులివర్తి శేషగిరిరావు, ప్రధాన్ హాస్పిటల్స్ సామాజిక బాధ్యతతో ముందుకు రావడం ప్రశంసనీయమని అన్నారు. జిఎంసి ఆధ్వర్యంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో ఇప్పటికే వాకింగ్ ట్రాక్ అభివద్ధి చేయబడిందని, ఇతరప్రాంతాల్లో ఇలాంటి సదుపాయాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు, ట్రాక్ సెక్రటరీ బెజవాడ శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న నాయకులు

23,24 మంగళగిరిలో సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నగర నాయకులు కె.శ్రీనివాసరావు కోరారు. ఆశా డే సందర్భంగా స్థానిక మంగళదాస్‌నగర్, ఇజ్రాయిల్‌పేట, సుద్దపల్లిడొంక, ఆనందపేట తదితర పిహెచ్‌సిలలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు.ఆశాల సమస్యలపై మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆశలకు జీతం పెంచి ఆరు సంవత్సరాలు అయ్యిందని, పెరుగుతున్న నిత్యావసర వస్తువు ధరలతో పోల్చితే వస్తున్న జీతాలు సరిపోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆశాలకు ఇచ్చిన ఫోన్‌లు సరిగా పనిచేయట్లేదని, ఆశా వర్కర్స్‌పై అధికారుల వేధింపులు అరికట్టాలన్నారు. ఈనెల 23, 24 తేదీలలో మంగళగిరిలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆశా వర్కర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు కాశీం షహీద్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకుల పాల్గొన్నారు.

పజాశక్తి- తాడేపల్లి : గుంటూరు జిల్లా 18వ మహాసభలు ఈనెల23,24 తేదీల్లో తాడేపల్లి పట్టణంలోని అమరారెడ్డి భవన్లో నిర్వహిస్తున్నట్లు సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు తెలిపారు. ఆమెరకు మంగళవారం మహాసభల సందర్భంగా ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు నారిన నాగేశ్వరరావు, కోట బాబురావు, డివి భాస్కర్ రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు : మండల కేంద్రమైన మేడికొండూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం సిఐజియూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల ఆశా వర్కర్ల సిఐటియు నాయకురాలు గౌస్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా సిఐటియు యూనియన్ నాయకులు సాంబశివరావు మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తారీఖు వరకు అఖిలభారత సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘ జిల్లా నాయకులు బొట్ల రామకృష్ణ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో

ఆర్డీవో తహశీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నకరికల్లు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్ రెడ్డి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ గతంలో కుంకులగుంట, చేజర్ల గ్రామాలలో వాడబలిజ సర్టిఫికెట్లు జారీ చేశారని తెలిపారు. 2012 తర్వాత ఉన్న ప్రభుత్వాలు సర్టిఫికెట్లు మంజూరు చేయలేదనీ, మంజూరు చేయాలని గ్రామస్తులు కొంతమంది హైకోర్టులో కేసు వేశారని తెలిపారు. నకరికల్లు గ్రామంలోని ఎన్ఎస్‌పి కాలనీలో ఉన్న జగనన్న లేఔట్‌లో పట్టాలు లేకుండా ఇండ్ల స్థలాలు క్రమించుకున్న వారికి నోటీసులు అందజేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ పుల్లారావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిద్దయ్య, పాల్గొన్నారు.



కబడ్డీకి ఎంపికైన విద్యార్థులతో ఫాదర్ ఆరోగ్యదాస్, తదితరులు

రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- తాడేపల్లి

తేదీల్లో కర్నూలో ఈనెల 7,8జరిగే రాష్ట్రస్థాయి అమత్తూర్ కబడ్డీ పోటీలకు తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్ గుడ్ న్యూస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎస్ భవ్య, ఓ విష్ణు ఎంపికైనట్లు రేవ, ఫాదర్ ఆరోగ్యదాస్, అడ్మినిస్ట్రేటివ్ ఫాదర్ సుగంధన్, పాఠశాల క్యాంపస్ ఇంచార్జ్ రేవ, ఫాదర్ శభాష్టియన్ తెలిపారు. ఈనెల మూడో తేదీ గుంటూరు బిఆర్ స్టేడియంలో నిర్వహించిన 35వ సబ్ జూని యర్ కబడ్డీ ఎంపిక లో అమ్మత్తూర్ కబడ్డీ, బీచ్ కబడ్డీ అసోసియేషన్ నిర్వాహకులు ఎంపికైన విద్యార్థులను ప్రకటించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటైర్డు ఎంఈఓ నాగయ్య

సైన్స్‌తోనే మానవుని మనుగడ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

సైన్స్‌తోనే మానవుడి మనుగడ ముడిపడి ఉందని, విద్యార్థులు కొత్త ఆవిష్కరణలను రూపొందించి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని రిటైర్డ్ ఎంఈఓ నాగయ్య అన్నారు. పట్టణంలోని శ్రీ సత్య సాయి విద్యా విహార్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఎగ్జిబిషన్లో చిన్నారి విద్యార్థులు గుడ్ ఫుడ్ బాడ్ ఫుడ్, గ్యాస్, లిక్విడ్, సాలిడ్, పేపరు, ప్లాస్టిక్, వుడ్, మెటల్ గురించి, నమూనాలను తయారు చేసి వాటి గురించి వివరించారు. నాగయ్య మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయని కొనియాడారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు కె.ఆదినారాయణ, ఏ.ఆంజనేయులు, సత్యసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఏ.అనిల్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జడ్. శీనివాసరావు, ప్రిన్సిపాల్ వై.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి-ఈపూరు

పిడుగుపాటుకు వివాహిత మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో చోటు చేసుకుంది. ముడెం లక్ష్మి (38) గేదెలను మేపేందుకు మంగళ వారం రాపర్ల వారి చెరువు సమీపంలోని పొలాల వైపు వెళ్లింది. మధ్యాహ్న సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడటంతో పిడుగుపాటు కు గురై లక్ష్మి అక్కడి కక్కడే మృతి చెందింది. సంఘటన ప్రాంతాన్ని ఎస్సై ఉమా మహేశ్వర పరిశీలించారు. మృతురాలి భర్త గతంలో ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



మృతి చెందిన ముడెం లక్ష్మి

మహిళ మృతి పై అనుమానాలు

ముడెం లక్ష్మి మృతిపై బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. లక్ష్మీ మెడలో బంగారు గొలుసు లేదని, సెల్ ఫోను కొంత దూరంలో పడి ఉండటంపై అనుమానాలు ఉన్నాయని పోలీస్ స్టేషన్‌లో బంధు వులు ఫిర్యాదు చేశారు.

వినుకొండ ప్రజలకు మెరుగైన సేవలు

ప్రభుత్వ చీఫ్ విప్ జీవి

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ ప్రజలకు అధికారులు, ఉద్యోగులు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు కోరారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ మొంథా తుపాన్ కారణంగా నియోజకవర్గంలో ప్రాణ నష్టం జరగకుండా అధికారులు సమర్ధవంతంగా పని చేశారని అభినందించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు నియోజకవర్గంలోని గ్రామాల్లో పంటలను పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి యాప్‌లో అప్లోడ్ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారని తెలిపారు. గ్రామాల్లో అంటూ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య మెరుగు పరచాలని అన్నారు. నివేశన స్థలాలకు దరఖాస్తులు చేసిన వారికి రెవిన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేయాలని, స్థలం లేని వారిని గుర్తించి ప్రతి ఒక్కరితో దరఖాస్తులు పెట్టించాలని, స్థలం ఉన్న వాళ్లకు పట్టాలు ఇచ్చి హౌసింగ్‌కి దరఖాస్తు పెట్టించాలని కోరారు. నియోజకవర్గంలో పట్టాదారు పాస్‌పుస్తకాల దరఖాస్తులు 6వేలు పెండింగులో ఉన్నాయని వెంటనే పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. సూర్య ఘర్ పథకం గురించి అధికారులు ప్రజల్లో అవగాహన పెంపొందించాలని చెప్పారు. అనంతరం తుపాను బాధితులకు మెరుగైన సేవలందించిన ఉత్తమ అధికారులను ఆయన సన్మానించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



అధికారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రం ఈపూరు ఫీడర్ మరమ్మత్తుల కారణంగా నేడు ఉదయం 8 గంటల మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎస్.గాంధీబాబు మంగళవారం తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సత్తెనపల్లి మండలం పెదమక్కెన, గర్నెపూడి గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి, బి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పత్తి, మిర్చి మొక్కలు అధిక తేమ వలన భూమి నుండి పోషకాలు గ్రహించలేవనీ, ఈ పరి స్థితులలో మొక్కలు ఎండిపోవడం, వడలడం, ఎర్రబారటం జరుగుతుందని రైతులకు వివరించారు. కాయ కుళ్ళుని తగ్గించడానికి 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సిఓసి) 0.1 గ్రా. స్ట్రెప్టో సైక్లిన్ లీ. మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిసేలా పిచికారీ చేయాలని వివరించారు. ఆకు మచ్చ తెగులు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యగా 3 గ్రా.లీ. మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సిఓసి) పిచి కారీ చేయాలని తెలిపారు. పెదమక్కెన, గర్నెపూడి గ్రామ రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో తమ విద్యార్థులు సత్తా చాటి ఘన విజయం సాధించారని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీలలో జెకె గోజురుయు కరాటే అకాడమీ అఫ్లియేయిట్ టు ఇంటర్నేషనల్ గోజురుయు కరాటే జంబుకాను ఇండియా వారి అధ్వర్యంలో ఈనెల 2న కృష్ణా జిల్లా విజయవాడ రైల్వే ఇనిస్టిట్యూట్ వేగన్ వర్క్‌షాప్ కాలనీ గుంటుపల్లిలో జరిగిన పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి 1800 మంది పాల్గొనగా తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి బహుమతులను కైవసం చేసుకున్నారన్నారు. మొదటి బహుమతి 8మంది, రెండవ బహుమతి ఆరుగురు, మూడవ బహుమతి నలుగురు మొత్తం 18 బహుమతులను కైవసం చేసుకున్నారన్నారు. భవిష్యత్ లో ఇదే ఒరవడితో అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇంచార్జి కోట బాపూజీ, కోచ్ ఓ. శివకష్ణ, పి.సునీతవాణి పాల్గొన్నారు.



విజేతలతో పాఠశాల ఛైర్మన్ వెంకటేశ్వర్లు, సిబ్బంది

రోడ్డు ప్రమాదాలను అరికట్టండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రపంచవ్యాప్తంగా జరిగే రోడ్డు ప్రమాదాలలో భారత దేశంలో 10శాతం పైగా జరుగుతున్నాయని, దేశంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజను మంగళవారం ఆయన స్వగృహంలో కలిసి సామాజిక వేత్త మాదాసు భాను ప్రసాద్ కోరారు. చేవెళ్లలో కంకర టిప్పర్, ఆర్టీసీ బస్సును ప్రమాదం కారణంగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. గతనెల కర్నూల్లో బస్సు దహనం దుర్ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయారని, మొదటి జరిగిన ప్రమాదాన్ని గుర్తించలేకపోవడం వలన మరో ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయారని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కమిటీలో ప్రమాదాల నియంత్రణ కోసం పోరాటం చేసే వారిని భాగస్వాములు చేయాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని కఠినంగా నియంత్రించాలని, మితిమీరిన వేగంతో రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్న టిప్పర్లపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మైనర్లు వాహనాలు నడుపుతున్నా, త్రిబుల్ రైడింగును నియంత్రించ లేకపోతున్నారని అన్నారు. డ్రైవర్లకు తగిన విశ్రాంతి, పనివేళల్లో నియంత్రణ, పరిశీలన లేకపోవడం ప్రమాదాలకు కారణమన్నారు. ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రఫాని

ఇంటర్ కనెక్షన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని 17వ వార్డు పరిధిలో వెంగల్ రెడ్డి కాలనీ మొదటి బజార్‌లో కాలనీవాసులు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఇంటర్ కనెక్షన్ పైపులైను పనులను చేపట్టారు. మున్సిపల్ ఛైర్మన్ షేక్‌రఫాని మంగళవారం పనులను పరిశీలించారు. ఆయన వెంట వార్డు ప్రెసిడెంట్ మచ్చా వెంకటేశ్వర్లు, రాజేష్‌ఖన్నా, నాగబాబు, చిన్న, శ్రీనివాసు, పుల్లేశ్వరరావు, ముల్లా కరిముల్లా, నక్క నరసింహ, వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న సిఐ వెంకటరమణ

దేశ ఐక్యత, సమగ్రతకు పాటుపడండి

ప్రజాశక్తి - మాచర్ల

ప్రతి భారతీయుడు దేశ ఐక్యత, సమగ్రతకు పాటుపడాలని, జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా మంగళ వారం అర్బన్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు, విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సిఐ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి పౌరుడు దేశానికి మనమేమి ఇచ్చామనే ప్రశ్న వేసుకొని, దేశ గౌరవాన్ని నిలిపే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై అనంతకష్ణ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని జాతీయ ఐక్యతకు అంకిత భావాన్ని వ్యక్తం చేశారు.

డ్రగ్స్ వద్దు బ్రో

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పల్నాడు జిల్లాసత్తెనపల్లి పట్టణంలో నాగార్జున కాలనీలో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ క్యాంపస్‌లో డ్రగ్స్, మహిళల పట్ల జాగ్రత్తపై విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సత్తెనపల్లి పట్టణ సీఐ నాగ మల్లేశ్వరావు పాల్గొని ప్రసంగించారు. ప్రతి విద్యార్థి చిన్న వయసు నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలనీ, చెడు వ్యసనాలకు, డ్రగ్స్ దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి, తల్లి దండ్రులకు, గురువులకు పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ కె.విశ్వనాధ్, కానిస్టేబుల్స్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పల్నాడు 'ఎ' జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కమిటీ ఎన్నిక పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. అధ్యక్షులుగా ఎ.ఇమ్మానియేల్ రాజు, గౌరవాధ్యక్షులుగా కె.డానియల్, ప్రధాన కార్యదర్శిగా ఎం.మోహనకుమారి, కోశాధికారిగా కె.జ్ఞాన రత్నం, మహిళా కార్యదర్శిగా ఎన్ఎన్ఎస్ఎల్ కాత్యా యని ఎన్నికయ్యారు. ఎన్నికను ఎపి పిఇటి అండ్ ఎస్‌ఎపిఇ అసోసియేషన్ పల్నాడు జిల్లాఅధ్యక్షులు బి.ఐ.స్వర్ణరాజు నిర్వహించారు.

జాతీయ చిత్రకారుడు ప్రసాదుకు సన్మానం

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ పట్టణానికి చెందిన జాతీయ చిత్రకారుడు బొడ్డుచర్ల ప్రసాదుకు గుంటూరు బృందావన గార్డెలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నటనాలయం సంస్థ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుశ్శాలవాలతో పూల మాలలతో జ్ఞాపికతో సత్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ వినుకొండలో జాషువా పులుపుల శివయ్య నడయాడిన గడ్డపై నేను పుట్టటం అదృష్టమని అన్నారు. తనను సన్మానించిన నటనాలయం సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి 7
గుంటూరు
బుధవారం 5 నవంబర్ 2025



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

పంట నష్ట నివారణా చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - చేబ్రోలు

తుపాను తరువాత వరి రైతులు పంటను కాపాడుకోవడానికి, తక్షణమే పంట నష్ట నివారణ చర్యలు చేపట్టాలని మండల ఇన్‌ఛార్జి అగ్రికల్చర్ ఆఫీ సర్ ఆర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నారాకోడూరు, వేజెండ్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొంథా తుఫాను ప్రభావంతో నేలకు వంగిన వరి మొక్కలను పైకి లేపి కలిపి కట్టి నిలబెట్టే ప్రయత్నం చేయాలన్నారు. దెబ్బతిన్న మొక్కలను తొలగించి, పొలంలో నీటిని బయటకు పంపాలని తెలియ జేశారు. వాతావరణం చల్లగా ఉండటం వలన వరి పంటకు ఎక్కువగా నాము పురుగు, సుడిదోమ ఆశిస్తుందన్నారు. తెగుళ్ల నివారణకు ఇమిడా క్లోప్రిడ్లేక మోనోక్రోటోఫాస్ 2.2 ఎంఎల్ లేదా డైనోటె ఫ్యూరాన్ 20 ఎం జి లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారి జి. మోహన్, గ్రామ ఉద్యాన సహాయకులు కె. విజయ్ కుమార్, జి కోటి లక్ష్మీ పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక రైలు పేటలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్ ఎదురు రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు బురదగా మారింది. అన్న క్యాంటీన్‌కు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా అన్న క్యాంటీన్ ప్రారంభించే నాటికి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని రూ. 10లక్షలతో 40 మీటర్లు పొడవు 24 అడుగుల వెడల్పు రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు గ్రామ కార్యదర్శి కె వివేకానంద తెలిపారు. రోడ్డుకు సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు పర్వతనేని హర్ష బాణావత్ వెంకటేశ్వర నాయక్ నవీన్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి మంచి కలపూడి గ్రామానికి చెందిన దాత తన తండ్రి యార్లగడ్డ వెంకటేశ్వరరావు పేరున మంగళవారం రూ. లక్ష బ్యాంకులో జమ చేసినట్లు ఆలయ కార్యదర్శి కె.సునీల్‌కుమార్ తెలిపారు. ఆలయ కార్యదర్శి వారికి ధన్యవాదాలు తెలిపి అమ్మవారి చిత్రపటం బహూకరించారు.



రోడ్డుపై వెళ్తున్న భారీ వాహనాలు

భారీ వాహనాలను దారి మళ్లించండి

ప్రజాశక్తి మంగళగిరి

ఆర్టీఏ, పోలీస్ అధికారులు ప్రజల ప్రాణాలను కాపాడాలని మంగళగిరి మండల ప్రయాణికుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నన్నపనేని నాగేశ్వరావు అన్నారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ రహదారిపై ఖాజా నుంచి విజయవాడ, రామవరపు పాడు మీదగా కొండపల్లి వెళ్ళవలసిన గ్యాస్ సిలిండర్స్ లారీలు, పెట్రోలు, డీజిల్ లారీలు అన్ని దాదాపు మంగళగిరి పట్నంలోని గౌతమ్‌బుద్ధ రోడ్డు, ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, కొత్త హైవే మీదుగా గొల్లపూడి నుంచి కొండపల్లి వెళుతున్నాయని పేర్కొన్నారు. వీరు రూట్‌మ్యాప్ ప్రకారం విజయవాడ, రామవరపుపాడు నుంచి వెళ్లాలని ఉందని పేర్కొన్నారు. ఈ భారీ వాహనాల మూలంగా టౌనులో, కృష్ణాయపాలెంలో వున్న రోడ్లు పాడైపోతున్నాయని తెలిపారు. వెంటనే పోలీస్, ఆర్టీఏ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి నాగేశ్వరావు కోరారు.

చిత్రకళా ప్రదర్శన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బిఎఫ్ఎ చివరి సంవత్సరం విద్యార్థులు కళా నైపుణ్యాలను ప్రతిబింబింప చేసేలా ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శన వర్సిటీలో అందరినీ ఆకట్టుకుంటోంది. బీఎఫ్ఏ నాలుగో సంవత్సరం విద్యార్థులు 6' గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన బృంద ప్రదర్శన ను మంగళవారం విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉప కులపతి కె.గంగాధరరావు, తాత్కాలిక రిజిస్ట్రార్ జి.సింహాచలం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రాచార్యులు ఆచార్య ఎం.సురేష్‌కుమార్ గౌరవ అతిథిగా పాల్గొని విద్యార్థుల కళా నైపుణ్యాన్ని ప్రశంసిం చారు. ఈ ప్రదర్శనను ఆర్కిటెక్చర్ కళాశాల విభాగాధిపతి నిరుపమ, పలువురు ఆచార్యులు సందర్శించి విద్యార్థులను అభినందించారు. తైలవర్ణ చిత్రాలు, అక్రిలిక్ పెయింటింగ్, రంగోలి, చార్కోల్ తదితర మాధ్యమాలతో రూపొందించిన చిత్రాలు, కళా ఖండాలు ఆకట్టుకున్నాయి. విభాగ సమ న్వయ కర్త అధ్యాపకులు పి. దేవకాంత్, ప్రఖ్యాత చిత్రకారులు బి జాన్ రత్నబాబు, బి. శేఖర్ బాబు, వి.వీరయ్య, షకీలా నూర్‌బాషా పాల్గొన్నారు.

చెకుముకి సైన్సు సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి - పెదకాకాని

జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ సైన్స్ సంబరాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలో గల శ్రీవేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్.తిరుపతిరావు అధ్యక్షతన పెద కాకాని మండలస్థాయి చెకుముకి సైన్సు సంబరాలు (టాలెంట్ టెస్ట్) ప్రారంభించారు. ముందుగా పాఠశాలల వారీగా ఎంపిక కాబడిన ముగ్గురు విద్యార్థులతో కూడిన ఎనిమిది పాఠశాలల విద్యార్థుల బృందాలు ఈ పోటీలలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనిగండ్ల ప్రథమ స్థానం పొందింది. ప్రైవేటు పాఠశాలల నుంచి శ్రీ విశ్వశాంతి హైస్కూల్, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వెంకటకృష్ణాపురం సంయుక్తంగా ప్రథమ స్థానం పొంది ఈనెల 23న వివేకా హైస్కూల్ తెనాలిలో జరిగే జిల్లాస్థాయి పరీక్షలకు ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు. బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రంగారావు జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ డాక్టర్ కుర్రాకృష్ణ, ఎస్.వెంకట్ రెడ్డి,కె.వెంకట్రావు, ఎన్. శివ శైలజ, విశ్వశాంతి హైస్కూల్ ప్రిన్సిపాల్ వై.వి. కృష్ణారావు, సిద్ధార్థ ఇం.మీస్కూల్ ఉపాధ్యాయులు రామ్‌చరణ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటర్లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతి రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడేపల్లి విద్యార్థుల టీం, అఖిల, మణికంఠ, నిషా ప్రైవేటు ఉన్నత పాఠశాలల విభాగంలో అరవింద హైస్కూల్ టీం, జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు ప్రకటించారు. ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్, జన విజ్ఞాన వేదిక నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యా యులు తాతి రెడ్డి విజేతలను అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ఈనెల 23వ తేదీన ఉంటుందని తెలిపారు.



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు

చెకుముకి సంబరాల్లో భాగంగా జనవిజ్ఞాన వేదిక గుంటూరు ఆధ్వర్యంలో నారాకోడురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్విజ్ ప్రోగ్రాంను మంగళవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు అధ్యక్షతన క్విజ్ ప్రశ్న పత్రాలని పొన్నూరు ఎంఈఓ విజయభాస్కర రాజు ఆవిష్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించుకోవడంతోపాటు మూఢ నమ్మకాల్ని విన్నాడాలని అన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ ప్రోగ్రాంలో చేబ్రోలు ఎస్ఎన్‌జి హైస్కూలు, వేజెండ్ల హైస్కూల్ నారాకోడూరు పాఠశాల ప్రయివేట్ పాఠశాల విభాగంలో డాన్ బోస్కో హైస్కూల్ చేబ్రోలు విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి చెకుముకి సైన్స్, టాలెంట్ టెస్ట్, మండల స్థాయిలో నారాకోడూరు పాఠశాల విద్యార్థులు వి.అవినాష్ , జి గౌతమ్, ఏ.మణికంఠ బృందం ప్రథమ స్థానం సాధించింది. వేజెండ్ల పాఠశాల ద్వితీయ స్థానం ఎస్ఎన్‌జి పాఠశాల చేబ్రోలు తృతీయ స్థానం సాధించాయి. ప్రభుత్వ పాఠశాలలో విభాగంలో నారా కోడూరు పాఠశాల ప్రథమ స్థానం సాధించగా, ప్రైవేట్ స్కూల్ విభాగంలో డాన్ బోస్కో స్కూలు చేబ్రోలు ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి చెకుముకి పోటీలకు మండలం తరపున ఎంపికయ్యారాని అన్నారు. విజేతలకు మండల విద్యాశాఖ అధికారులు రాయలసుబ్బారావు చలపతిరావు బహుమతులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.విశ్వేశ్వర రావు, హరిప్రసాద్ మండలం లోని వివిధ పాఠశాల సైన్సు ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



పత్తి మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మొక్కల్లో గాలి కాంతి ప్రసరణ పెంచండి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పత్తి పంట 120 రోజుల దశలో ఉన్నాయని పొలాలు చళ్ళు దున్ని మొక్కలలో గాలి కాంతి ప్రసరణ పెంచాలని ఏడీఏ మోహన్ రావు తెలిపారు.మంగళ వారం ప్రత్తిపాడు మండలంలోని గొట్టిపాడు, ప్రత్తిపాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మోహన్ రావు మాట్లాడుతూ పత్తిలో తేమ ఎక్కువగా ఉంటే,నీడలో ఆరాబెట్టడం మంచిది.5గ్రా/లీ బోరాక్స్10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని కాయకుళ్ళుని తగ్గించడానికి 3గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సిఓసి)0.1గ్రా. స్ట్రెప్టో సైక్లిన్/లీ మొక్కల క్రింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిసేలా పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు వృద్ధి చెందకుండా ఉండడానికి ముందస్తు చర్య చేపట్టాలని తెలిపారు. సెక్రటరీ ఫిజియాలజీ సైంటిస్ట్ ప్రిన్సిపాల్ డా శ్రీకాంత్, ఏవో షేక్. సుగుణ బేగం వీఏఏలు ఎన్. నిహారిక, కె.లావణ్య, వి. హెచ్ ఏ.షణ్ముఖ, ఏఈఓ వై.నీలంబరం రైతులు పాల్గొన్నారు.



కరాటేలో మెళకువలు తెలుపుతున్న రవిబాబు

విద్యార్థుల స్వీయ రక్షణకు కరాటే

ప్రజాశక్తి మంగళగిరి

నిర్మలా ఫార్మసీ కళాశాల, మంగళగిరి జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం రత్నాల చెరువులో జరుగుతున్న ప్రత్యేక శిబిరం నాలుగవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బాలల భద్రత - మన బాధ్యత అనే అంశంపై కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జపాన్ వెరైటీ అసోసియేషన్ చీఫ్ ఇన్స్ట్రక్టర్ కే రవిబాబు కరాటే శిక్షణను ప్రాక్టికల్ రూపంలో విద్యార్థులకు స్వీయరక్షణలో అనుసరించాల్సిన మూడు కీలక అంశాలను వివరించారు. కరాటే ప్రమాదంలో ఉన్నప్పుడు ముందుగా భద్రంగా బయట పడటం కోసం అన్నారు. ఏ పరిస్థితిలోనైనా తమను తాము రక్షించుకునే నైపుణ్యం ప్రతి బాలికకు అవసరం అని తెలిపారు. కళాశాల మహిళా విభాగం కోఆర్డినేటర్ ఆర్ రత్న మంజుల మాట్లాడుతూ బాలలపై జరిగే వేధింపుల నివారణ, అప్రమత్తత, పోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రేఖ నరేష్ బాబు,కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాముల రెడ్డి, స్టూడెంట్ కోఆర్డినేటర్లు ఎస్ అక్స సాత్విక, సాయి మనోజ్ఞ, తనుశ్రీ, కే హర్షవర్ధన్, జి కీర్తి, ఎం.రవి, బి.సంజన, సిహెచ్ నాగేశ్వర రావు, సిహెచ్ కార్తికేయ, శ్రీరామ్ పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

336వ రోజుకు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 336వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో చిట్టీమల్ల పిచ్చయ్య, బి.సూర్యప్రకాష్, బొక్కాజోజి, దామవరపునాగేశ్వరావు, మల్లె గురవయ్య కూర్చున్నారు. దీక్షలను నాయకులు కే స్టీవెన్, బిఅంకయ్య, షైకసుభాని, వై సాంబశివరావు, ఆశీర్వాదం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తుపాకుల నాగేశ్వరావు, డి.మాణిక్యరావు, బి.ఏసోబు, ఎసదేవా మహిళలు పాల్గొన్నారు.



క్విజ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పొన్నూరు

రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గ స్థాయి విద్యార్థులలో రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించేందుకు ఎంఈఓ ఆధ్వర్యంలో రాజ్యాంగంపై నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన క్విజ్ పోటీలలో మండల పరిధిలోని మాచవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాచవరం ప్రధానోపాధ్యాయులు షేక్ మహబూబ్ బాషా తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన వక్తృత్వ వ్యాస రచన క్విజ్ పోటీలలో మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రుద్రపాటి సౌమ్య, ఉప్పాల లక్ష్మీ ప్రసన్న ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచి పొన్నూరు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలియచేశారు. జిల్లా స్థాయిలలో పోటీల అనంతరం గెలుపొందిన విద్యార్థులకు నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పొన్నూరు ధూపం రాజు, కె.విజయభాస్కర్ నేతృత్వంలో నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ వేడుకల పోటీలలో నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన విద్యార్థినిలను మాచవరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, ప్రముఖులు అభినందించారు.

ఎంఈఓ కార్యాలయానికి బీరువా బహూకరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు



బీరువాను అందజేసిన కృష్ణమోహన్‌రావు

మండలంలోని పాలపర్రు అంబేద్కర్ నగర్‌లోని ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయులుగా పని చేసి పదవీ విరమణ చేసిన ఎం. కృష్ణ మోహన్‌రావు గుర్తింపుగా పెదనందిపాడు మండల విద్యా వనరుల కేంద్రానికి మంగళవారం ఇనుప బీరువా అంద జేశారు. మండల విద్యాశాఖ అధికారి-1. కెఎఫ్ కెనడి, మండల విద్యాశాఖాధికారి-2. పి.జాకబ్ దాత కృష్ణ మోహన్ రావును అభినందించారు.

ఎస్ఆర్ఎంలో ఫుడ్ పాయిజన్‌పై ప్రభుత్వం స్పందించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో మరోసారి ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవటం ఆందోళన కలిగిస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్, షేక్.సమీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలో రాజధాని ప్రాంతంలోని పేరుగాంచిన ప్రైవేటు యూనివర్సిటీలలో తరచుగా జరుగుతున్నా నివారణ చర్యలు ఉండట్లేదని, అందువల్లే సమస్యలు పునరావృతం అవుతున్నాయన్నారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు లక్షల రూపాయలు ఫీజులు చెల్లించినా, కనీస సదుపాయాలు, సరైన ఆహారం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలోకూడ విట్, ఎస్ఆర్ఎంలో ఆహార నాణ్యత సరిగా లేదని విద్యార్థులు ఆందోళన చేశారని, అప్పుడే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటే ఇప్పుడు సమస్య తలెత్తేది కాదన్నారు. యాజమాన్యాలు కూడా తమ లోపాలను సరిదిద్దుకోవట్లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ప్రైవేటు విద్యాలయాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు అందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు.


టెన్నిస్ పోటీల్లో భాష్యం విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి-గుంటూరు



జోషితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

భాష్యం విద్యార్థులు చదువులోనే కాకుండా ఇతర రంగాల్లో సైతం తమ ప్రతిభను కనబరుస్తూ ఉత్తమంగా రాణించడం అభినందనీయమని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఈనెల 1,2,3 తేదీల్లో శ్రీకాళహస్తిలో నిర్వహించిన 69వ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నిస్ టోర్నమెంట్ లో భాష్యం స్కూల్ విద్యార్థిని గోలి జోషిత ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించినట్లు రామకష్ణ తెలిపారు. 2026 జనవరి 10 నుండి 15వ తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు కెప్టెన్‌గా జోషిత వ్యవహరించనుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఛైర్మన్ రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, డైరెక్టర్ సాకేత్‌రామ్‌లు జోషితకు అభినందనలు తెలిపారు. జెడ్ఈఓ శివ, ప్రిన్సిపాల్ కిషోర్‌లు జోషితను ప్రత్యేకంగా అభినందించారు.




ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్, ప్రిన్సిపాల్

కళ్లం కాలేజి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

కళ్ళం ఇంజినీరింగ్ కాలేజిలో 2026 విద్యాసంవత్సరంలో బి.టెక్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేసుకోబోతున్న ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగాల విద్యార్థులు గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ ఉద్యోగాలు పొందారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు. రూ.2.60లక్షలు వార్షిక వేతనంతో ఎంపిక అయ్యారని కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధి శ్రీనమశివాయ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పి.ఎల్.మాధవరావు, ఇంజినీరింగ్ విభగాధిపతులు డాక్టర్ సతీష్, డాక్టర్ కె.హరికృష్ణ, ప్రొఫెసర్ రాజు అభినందించారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో సెక్రెటరీ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాల్‌టెక్ సంస్థల్లో ఆర్‌విఆర్ జెసి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

ఇటీవల తమ కళాశాలలో ఐటీ సంస్థ పాల్‌టెక్ నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 9 మంది విద్యార్థులు అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హోదాలో రూ.6లక్షల వార్షిక వేతన ప్యాకేజితో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తెలిపారు. వార్షిక వేతనంతోపాటు ఇంటర్న్‌షిప్ సమయంలో రూ.25వేలు స్టైఫండ్ కూడా పొందుతారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను మంగళవారం కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, సిబ్బంది అభినందించారు. డేటా అనలిటిక్స్ వంటి అత్యాధునిక రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో సేవలు అందిస్తున్న పాల్‌టెక్‌లో విద్యార్థులకు అవకాశం రావటం కళాశాలకు గర్వకారణం అని సెక్రెటరీ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. సిఎస్‌బిఎస్ విభాగం విద్యార్థులు ఎస్.వి.ప్రశాంత్, డేటా సైన్స్ నుండి కె.ప్రేమశ్రీ, కె.వి.నాగవెంకట్, ఆర్.తేజ తనిష్క్‌చౌదరి, సిఎస్ఈ విభాగం నుండి ఆజయ్‌కుమార్, శివసాయి, డి.రాజేష్, కె.రామ్‌శ్రవణ్, ఓ.సందీప్‌కుమార్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారులు సిహెచ్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకు చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు



ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న లక్ష్మణరావు, తదితరులు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయటానికి, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక హిందూ ఇంజినీరింగ్ కాలేజిలో నగరస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, పరిశోధనలపై దృష్టి సారించాలని, దేశ ప్రగతికి పాటుపడాలని అన్నారు. సైన్స్ సంబరాలలో వివిధ పాఠశాలల నుండి 80 టీములలో 240 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య ఉన్నత పాఠశాల, జలగం రామారావు ఉన్నత పాఠశాల, ఎస్‌కెబిహున్నత పాఠశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో శ్యామలా నగర్ శ్రీ వెంకటేశ్వరా బాలకుటీర్, కాటూరి పబ్లిక్ స్కూల్, బ్రాడీపేట వెంకటేశ్వరా బాలకుటీర్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. పాటిబండల సీతారామయ్య హైస్కూల్ కన్సోలేషన్ బహుమతి సాధించింది. కార్యక్రమంలో జెవివి నాయకులు ఎం.ఉదయ భాస్కర్, టి.జాన్‌బాబు, జి.వెంకటరావు, బి.ప్రసాద్, టి.ఆర్.రమేష్ పాల్గొన్నారు.

పిపిఎఫ్‌లో ఆన్‌లైన్ ట్రాకింగ్ సేవలను ప్రారంభించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు



జెడ్పీ సిఇఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ తదితర అర్జీల సమాచారం తెలుసుకోవటానికి ఆన్‌లైన్ ట్రాకింగ్ సేవలు ప్రారంభించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ కోరారు. ఈ మేరకు జెడ్పీ సిఇఒ వి.జ్యోతిబసుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఫైల్ స్టేటస్ తెలుసుకోవాలంటే ఉమ్మడి జిల్లాలోని సుదూర ప్రాంతాలైన మాచర్ల, రేపల్లె తదితర ప్రాంతాల నుండి ఉపాధ్యాయులు సెలవులు పెట్టి తిరగాల్సి వస్తుందన్నారు. కావున ఆన్‌లైన్ ట్రాకింగ్ సౌకర్యం కల్పిస్తే ఉపాధ్యాయులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. అదేవిదంగా 2022 జనవరికి సంబంధించిన ఉపాధ్యాయుల ప్రీమియం నమోదుకు చర్యలు చేపట్టాలని, సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న అర్హులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, ఎం.గోవిందు, బి.ప్రసాద్, కె.ప్రేమ్ కుమార్, రంగారావు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

గృహ అవసరాల తయారీపై మహిళలకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు



శిక్షణకు హాజరైన మహిళలతో ఏఎన్‌యు వీసీ, స్థానిక కార్పొరేటర్ తదితరులు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ, కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబులిటీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక 41వ డివిజన్, పుచ్చలపల్లి సుందరయ్యనగర్లోని సి.హెచ్. హరిబాబు స్మారక భవన్‌లో గృహ అవసరాల తయారీపై శిక్షణ కార్యక్ర మం నిర్వహించారు. ఈశిక్షణను ఏ.ఎన్.యూ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ కె.గంగాధర్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ శిక్షణను ప్రతి ఒక్కరు ఉపయోగించుకొని కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. పారిశ్రామికవేత్తలు అందరు ప్రారంభంలో చిన్న స్థాయి నుంచే ఎదిగారని తెలిపారు. కార్పొరేటర్ స్మిత పద్మజ మాట్లాడుతూ పేదల అభివద్ధికి ఇటువంటి నైపుణ్య శిక్షణలు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. ఎఎన్‌యూ సిఎస్ఆర్ విభాగం డైరెక్టర్ డాక్టర్ బబిత మాట్లాడుతూ విద్యతోపాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని 2010లో సిఎస్ఆర్ విభాగం ఏర్పాటు చేసి నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ట్రైనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పెయిన్‌బామ్, వాషింగ్ పౌడర్, పెనాయిల్ తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ విభాగం సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.వెంకటరమణ, ప్రొఫెసర్ ఎం.వి.ఎస్ కోటేశ్వరారావు స్కూల్ అడ్మినిస్ట్రేటర్ ఎల్.ఎస్. భారవి, సుందరయ్య నగర్ అభివృద్ధి కమిటీ నాయకులు ఎ.నికల్సన్, షేక్.మస్తాన్‌వలి పాల్గొన్నారు.

వెంగళయపాలెం అమృత్ సరోవర్ పనులను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రూరల్ మండలం, వెంగళాయ పాలెంలోని మోడల్ అమృత్ సరోవర్ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం పరిశీలించారు. వెంగళయపాలెం ఊర చెరువును మోడల్ అవృత్ సరోవర్ అభివృద్ధి పనుల కింద చేపట్టారని, ఈ నెల 11వ తేదీన వెంగళాయపాలెంలో జాతీయ వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కావున పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖకు చెందిన అదనపు కమిషనర్ సిపి రెడ్డి, సంచాల కులు వైవికె. షణ్ముఖకుమార్, ఎం.శివప్రసాద్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, మండల పరిషత్ అభివద్ధి అధికారి శ్రీనివాస్, డిప్యూటీ ఎంపిడిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. తన కార్యాలయంలో ప్రతి మంగళవారం నిర్వహించే మహిళా గ్రీవెన్సులో భాగంగా మంగళవారం మహిళల నుంచి వినతులను స్వీకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గత నాలుగు వారాల్లో వందకు పైగా మహిళల నుంచి వివిధ సమస్యలపై వినతులు అందాయన్నారు. వాటిలో దాదాపు 60కి పైగా సమస్యలను త్వరితగతిన పరిష్కరించగలిగామని తెలిపారు. మహిళలు పోలీస్ స్టేషన్లు, ఇతర కార్యాలయాల్లో న్యాయం దొరకలేదని భావించి తమ వద్దకు వస్తున్నారని వారి సమస్యల పరిష్కారం కోసం అధికారులతో చర్చిస్తున్నట్టు తెలిపారు. తక్షణ పరిష్కారం న్యాయ సహాయం చేస్తామన్నారు. రేషన్ కార్డుల విభజన, కొత్త పెన్షన్‌లు, తల్లికి వందనం పథకం రాని వారు తమ సమస్యలను వివరించారు. వివిధ డివిజన్లలో శానిటేషన్ సమస్యలు, అప్పు మోసాలు, ఈవ్‌టీజింగ్ వంటి సమస్యలతో మహిళలు వస్తున్నారు. చిన్న సమస్యలకు రెండు రోజుల్లోనే పరిష్కారం లభించేలా అధికారులతో సమన్వయం చేస్తూ ఉన్నామన్నారు. గుంటూరులో ప్రజా పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని తన దృష్టికి వచ్చిందని దీనిని సీరియస్‌గా తీసుకుంటామని తెలిపారు.

వైద్యుల ఇంట్లో బంగారపు బిస్కెట్లు చోరీ

ప్రజాశక్తి తెనాలి

పట్టణంలో భారీ చోరీ జరిగింది. రైల్వే స్టేషన్ రోడ్‌లో ప్రైవేట్ వైద్యశాల నిర్వహిస్తున్న వైద్యుల ఇంటిలో దాదాపు రూ.64 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైనట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి వైద్యుల నివాసంలో వారి సేఫ్ లాకర్ ఓపెన్ చేసి చూడగా ఐదు బంగారపు బిస్కెట్లు, రూ.5.50 లక్షల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టినట్లు సిఐ ఎస్.సాంబశివరావు తెలిపారు.

రీవాల్యూషన్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన పరీక్షల రివల్యూషన్స్ ఫలితాలను మంగళ వారం విడుదల చేసినట్లు పరీక్షల నిర్వహణాధికారి ఏ. శివ ప్రసాద్ తెలిపారు. ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్మెంట్, ఎం.కాం2 వ సెమిస్టర్, బీఈడీ 1,4 సెమిస్టర్ ఫలితాలను, ఎమ్మెస్సీ నానో టెక్నాలజీ 4/5, 3/5 మొదటి సెమిస్టర్, ఫుడ్ అండ్ న్యూట్రి షన్ 4వ సెమిస్టర్‌ల రివాలుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

డాక్టర్ శ్రీనివాస్ రెడ్డిపై డిసిహెచ్‌ఎస్ విచారణ

ప్రజాశక్తి - వినుకొండ : వినుకొండ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డిపై పల్నాడు జిల్లా డిసి హెచ్ ఎస్.ప్రసూన మంగళవారం విచారణ చేపట్టారు. సూపరిండెంట్ శ్రీనివాసరెడ్డిపై హాస్పిటల్ వైద్యులు కొందరు, సిబ్బంది కలిసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ వారికి ఫిర్యాదు చేయడంతో విచారణకు పల్నాడు జిల్లా డీసీహెచ్‌ఎస్‌ను ఆదేశించడంతో విచారణ చేపట్టినట్లు ప్రసూన తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయం త్రం 7గంటల వరకు ఉద్యోగుల్ని, డాక్టర్లని సిబ్బం దిని విచారించారు. నివేదికను డైరెక్టర్ ఆఫ్ సెకం డరీ హెల్త్‌కు అందజేస్తామని తెలిపారు. సూపరిం డెంట్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డిపై ఫిర్యాదు వివరాలు, ఫిర్యాదు దారుల పేర్లు చెప్పేందుకు నిరాకరించారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి- తాడేపల్లి : నివాసాల మధ్య గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న పేకాటడం డెన్‌పై మంగళవారం తాడేపల్లి పోలీసులు దాడి చేశారు. దాడుల్లో 4 గురు మహిళలతో పాటు ఇద్దరు పేకాట రాయుళ్ల ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ69 వేల నగదు, నాలుగు ద్వి చక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - క్రోసూరు : నేడు క్రోసూరు సబ్ స్టేషన్ పరిధిలో క్రోసూరు, అనంతవరం గ్రామాల్లో ఉదయం 9 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొలం పిలుస్తుంది కార్యక్రమం

ప్రజాశక్తి - పొన్నూరు : పొన్నూరు మండలం ములుకుదురు, మాచ వరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. వరి పైరులో ప్రస్తుతం ఈనిక దశ నుండి పాలు పోసుకునే దశ వరకు వున్నదని గమనించి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మదలచిన రైతులు విధిగా తమ పేర్లను రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయ కులు సిహెచ్ భానురేఖ, ఎస్ ప్రవళిక, ఎంపీఈఓ ఎస్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బిఎఫ్‌ఎ చివరి సంవత్సరం విద్యార్థులు వారు నేర్చుకున్న కళా నైపుణ్యాలను ప్రతిబింబింపచేసేలా ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శన వర్శిటీలో అందరినీ ఆకట్టుకుంటోంది. బీఎఫ్‌ఏ నాలుగో సంవత్సరం విద్యార్థులు Y-22 Arora 6' గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద ప్రదర్శనను మంగళవారం విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతి కె. గంగాధర రావు,తాత్కాలిక రిజిస్ట్రార్ జి సింహాచలం ప్రారంభించారు. కార్యక్రమానికి కళాశాల ప్రాచా ర్యులు ఆచార్య ఎం.సురేష్ కుమార్ గౌరవ అతిథిగా పాల్గొని విద్యార్థుల కళా నైపుణ్యాన్ని ప్రశంసించారు. ఈ ప్రదర్శనను ఆర్కిటెక్చర్ కళాశాల విభాగాధిపతి నిరుపమ, పలువురు ఆచార్యులు సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ ప్రదర్శనలో చిత్ర కళా విద్యార్థులు జి.అనిల్ మనోహర్, సి హెచ్. హెలీనా, యం.సునీత, పి. సాగరిక, డి. నితిన్ ఫ్రైస్,యం.గణేష్ తయారు చేసిన కళాఖండాలు సందర్శకుల నుంచి మంచి ప్రశంసలు అందుకున్నాయి. తైల వర్ణ చిత్రాలు, అక్రిలిక్ పెయింటింగ్, రంగోలి, చార్కోల్ మాద్యమాలతో రూపొందించిన చిత్రాలు, కళాఖండాలు ఆకట్టుకున్నాయి. విభాగ సమన్వయ కర్త అధ్యాపకులు పి. దేవకాంత్, ప్రఖ్యాత చిత్రకారులు బి.జాన్ రత్నబాబు, బి. శేఖర్‌బాబు, వి. వీరయ్య , షకీలా నూర్‌బాషా పాల్గొన్నారు.



చూపరులను ఆకట్టుకున్న కళాఖండాలు

కార్పొరేషన్ పరిధిలో సిటిజన్ ఫోరం ఏర్పాటుకు సమావేశం

ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు... కన్వీనర్‌గా సాయి ప్రసాద్



సిటిజన్ ఫోరం సన్నాహక సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో సిటిజన్ ఫోరం ఏర్పాటుకు సన్నాహక సమావేశం మంగళవారం మంగళగిరి పట్టణంలోని విజెపి అండ్ డిఎల్‌బి డిగ్రీ కళాశాలలో జరిగింది. సమావేశానికి ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె వి ఎస్ సాయి ప్రసాద్ అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. 15 సంవత్సరాల క్రితం ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి సమగ్ర సాధన కమిటీ ఏర్పడి పోరాటం చేసి మంగళగిరి ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి సాధించడం జరిగిందని తెలిపారు. చినకాకానీ క్యాన్సర్ ఆసుపత్రి స్థలంలో ఈ సంవత్సరం ఏప్రిల్ 13వ తేదీన శంకుస్థాపన జరిగిందని తెలిపారు. శంకుస్థాపన రోజే మరలా వచ్చే ఏప్రిల్ నాటికి ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని మంత్రి నారా లోకేష్ తెలియజేశారనాక్నరు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ స్థానంలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో సిటిజన్ ఫోరం ఏర్పాటు చేయాలని పలువురు అభిప్రాయపడ్డారు. రాజకీయాల కతీతంగా పెరుగుతున్న జనాభా కనుగుణంగా, ప్రజల అవసరాల దృష్ట్యా సిటిజన్ పురం ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందు లను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంగళగిరి పట్టణంలో డ్రైనేజీ, ఇంటి పన్నులు, ట్రాఫిక్, ఆర్టీసీ బస్సులు మంగళగిరి పట్టణానికి రావడం లేదనే సమస్యలు ఉన్నాయని ప్రస్తావించారు. మంగళగిరి రైల్వేస్టేషన్లో రైళ్లు కొన్ని మాత్రమే అవుతున్నాయని, ఆ సమస్యనూ పరిష్కరించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజల అవసరాల దృష్ట్యా అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. కార్పొరేషన్కు ఎన్నికలు జరపకపోవడం వలన అనేక సమస్యలు ప్రజలు పరిష్కరించులో పోలేకపోతున్నారని వాపోయారు. ఐదుగురితో ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పడింది. కన్వీనర్‌గా డాక్టర్ కెవిఎస్ సాయి ప్రసాద్, కో కన్వీనర్ గా దామర్ల వెంకట నరసింహం, సభ్యులుగా ఎస్.బాలకష్ణ, సింహాద్రి శ్రీనివాస్ రెడ్డి, వివి ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో మంగళగిరి మండల ప్రయాణికుల సంఘం ప్రధాన కార్యదర్శి నన్నపనేని నాగేశ్వరావు, జేవి రాఘవులు, ఎస్ ఎస్ చెంగయ్య, చిన్ని తిరుపతయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి వి వెంకటేశ్వరరావు, ఎం రవి, ఎం నాగేశ్వరావు, ఎస్ రామ్ చందు, పి సుందర రామిరెడ్డి, షేక్ బాజీ సైదా పాల్గొన్నారు.

6న ఎన్ఎమ్ఎమ్ఎస్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ, పంపిణీ

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) పూర్వ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి సహకారంతో ఎన్ఎమ్ఎమ్ ఎస్‌స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఈనెల ఆరవ తేదీ ఉదయం 10 గంటలకు పెదనంది పాడులోని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో పూర్వ శాసన మండలి సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు ఆవిష్కరిస్తారని విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదనందిపాడు, కాకుమాను మండలాల లోని ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతూ, ఎన్ఎమ్ఎమ్ఎస్ స్కాలర్ షిప్ పరీక్ష రాస్తున్న విద్యా ర్థులకు ఈ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. ఈ పుస్తక ప్రచురణకు నాట్స్ తరపున నాగులపాడుకు చెందిన బాపయ్య చౌదరి సహకారం అందించినట్లు తెలిపారు.6 వ తేదీ పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగే కార్యక్రమంలో లక్ష్మణరావుతో పాటు బాపయ్య చౌదరి తల్లిదండ్రులు నూతి సుబ్బారావు, సీతాదేవి, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం (గుంటూరు) మేనేజింగ్ ట్రస్టీ పాశంరామారావు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు దాసరి శేషగిరిరావు,అర్వపల్లి కష్ణ మూర్తి, పూర్వ ఎమ్.పి.పి.నర్రా బాలకష్ణ, విద్యావేత్త ముద్దన రాఘవయ్య ,పెదనందిపాడు, కాకుమాను మండలాల విధ్యాధికారులు పోపూరి జాకబ్, కె.ఎఫ్.కెనడీ స్థానిక పి.ఎ.ఎస్.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య పాల్గొంటారని, ఎన్ఎమ్ ఎమ్ఎస్. పరీక్ష రాస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు,స్తానిక ప్రజలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని రమేష్ బాబు కోరారు.

సబ్ - జూనియర్స్ కబడ్డీ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్రోసూరు

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జరిగిన ఆంధ్ర అసోసియేషన్ సబ్ జూనియర్స్ కబడ్డీ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలలో ఏపీ మోడల్ స్కూల్ క్రోసూరులో ఇంటర్మీడియట్ ఎంపీసీ విద్యార్థి బి. జగదీశ్ రాం ఈనెల 7న జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు స్కూలు ప్రిన్సిపాల్ ఎం. మేరీ సూజన్ తెలిపారు. రాష్ట్రస్థాయి కమిటీ పోటీలకు ఎంపికైన జగదీష్ రాంను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సహ చట్టం విలువలు కాపాడండి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సమాచార హక్కు చట్టం నీరు గార్చకుండా విలువలు కాపాడాలని రాష్ట్ర సమాచార కమిషనర్ రెహానా బేగం పేర్కొన్నారు. మంగళవారం ఫోరమ్ ఫర్ ఆర్టీఐ జాతీయ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో కమిషనర్ రెహానా బేగం ను మర్యాదపూర్వకంగా కలిసారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం అమలు తీరు, ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ రెహానా మాట్లాడుతూ 20కు పైగా అవసరం లేని అంశాలపై రాష్ట్రంలో కొంత మంది ఆర్టీఐలు పెడుతున్నారని, మరికొంత మంది బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అలాంటి వారి నుండి సమాచార హక్కు చట్టం ను పరిరక్షించుకోవాలన్నారు. ఫోరమ్ ఫర్ ఆర్టీఐ ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రముఖ పాత్ర పోషించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధ్యక్షులు మట్ట ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు ఎం.సుధాకర్ పాల్గొన్నారు.



ఎన్నికైన ఏపీజే అబ్దుల్ కలాం పార్లమెంటు సభ్యులు

నాయకత్వ లక్షణాలపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ సిస్టర్ విద్య ఆధ్వర్యంలో ఎంటిఎంసీ పరిధిలోని కొలనుకొండ గ్రామంలో ఆర్‌సిఎం చర్చి వద్ద మంగళవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ సభ్యులకు బాధ్యతలు, విధులుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల బాలికల ఎన్నికైన పార్లమెంట్ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కోఆర్డినేటర్ అనూష మాట్లాడుతూ బాల బాలికలు చిన్ననాటి నుండి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవా లన్నారు. సమాజం పట్ల సమాజంలో ఉన్న సమస్యలను గుర్తించి, స్థానిక అధికారుల దష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం మార్గాలు కనుగొనే విధంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ పిల్లలకు తర్ఫీదు ఇస్తున్నామని అన్నారు. దీనివల్ల నేటి బాలలు రేపటి పౌరులుగా ఎదుగుతారని అన్నారు. మహిళా పోలీస్ రాధిక మాట్లాడుతూ బాలబాలికలలో చిన్న నాటి నుంచి సమాజం పట్ల బాధ్యత గల వ్యక్తులుగా తయారు చేయటం గొప్ప విషయం అన్నారు. ఏఎన్ఎం జి.లక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను బాల బాలికలు అవగా హన చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుడ్‌షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అత్తోట పోతురాజు, కే అనూష, జె ఇస్రాయెల్, అంగన్వాడి ఆశావర్కర్లు, గ్రామసచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

పిహెచ్‌సి విస్తృత సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆశడే సందర్భంగా వడ్లపూడి పిహెచ్‌సి సెంటర్ విస్తృత సమావేశం మంగళవారం జి.వాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంగళగిరి సిఐటియు రూరల్ కార్యదర్శి వుద్దంటి దుర్గారావు మాట్లాడుతూ ఆశ వర్కర్స్ పోరాటాల ద్వారా కొన్ని హక్కులు సాధించుకున్నారని తెలిపారు. కనీస వేతనం ఉద్యోగ భద్రత కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. వాటి సాధనకై విశాఖపట్నంలో డిసెంబరు 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు జరిగే జాతీయ మహాసభలను జయ ప్రదం చేయాలని కోరారు అనంతరం పీహెచ్‌సి నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఎం సుమనశ్రీ ఆర్ మణిదేవి ఉపాధ్యక్షులుగా సునీత సహాయ కార్యదర్శిగా కె రజిని కోశాధికారిగా జి.వాణిని ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో పిహెచ్సిలోని ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెల్లింపు

ప్రజాశక్తి - క్రోసూరు

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం తరు పున తెలుగుదేశం తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యురాలు చవల సరోజినికి రూ.5లక్షలను మాజీ మార్కెట్‌యార్డ్ కాంద్రు కాశయ్య, నీటిసంఘం అధ్యక్షుడు మన్నెం శ్రీను, నల జాల కోటేశ్వరరావు ప్రమాద బీమా చెల్లింపు చేసినట్లు తెలిపారు. వారు మాట్లా డుతూ చవల ప్రభుదాసు అకాల మం ఇం టిడిపి కుటుంబానికి తీరని లోటని అన్నారు. కార్య క్రమంలో మన్నెం పాపారావు, డాక్టర్ షరీఫ్, వెంకట్రావు, పరిసరాం బాబు, హస్సను, కరీముల్లా, మన్నెం శివయ్య, జుజ్జురి వెంకట్రావు, అనుమల పూర్ణచంద్రరావు, శివుడు, దొడ్లేరు ఎస్సి నాయకుడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దుద్దుల యోహాను, చిలక రవి పాల్గొన్నారు.